నింగి నేలను తాకినట్లుగా
కొండను
కప్పేసిన మంచు



మంచుకురిసే వేళలో...



చల్లటి వాతావరణంతో రైల్వేకోడూరు మన్యంను తలపిస్తోంది. ఉదయం 7 గంటల వరకు మంచు రైల్వేకోడూరును కప్పేస్తోంది. చుట్టూ ఏర్ల మధ్యలో ఊరు ఉండడంతో చలి ఎక్కువగా ఉంటోంది. రైల్వేకోడూరును ఆనుకుని దట్టమైన శేషాచలం, పాలకొండలు, పెనుశిల తదితర అడవులు ఉన్నాయి. దీంతో ఉదయం ఎండ వచ్చే వరకు ఏమీ కనిపించకుండా మంచు దుప్పటి కప్పేస్తోంది.

- రైల్వేకోడూరు (ఆంధ్రజ్యోతి)

14న జాతీయ లోక్ అదాలత్

- కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ఐదో అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి



న్యాయవాదులతో మాట్లాడుతున్న జడ్జి కృష్ణన్‌కుట్టి

రాయచోటిటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలోని ఐదో అదనపు జిల్లా జడ్జి కోర్టులో డిసెంబరు 14వ తేదీ జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఐదో అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి తెలిపారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహణపై న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ రాయచోటి జిల్లా కోర్టు పరిధిలోని అన్ని కోర్టులలో డిసెంబరు 14వ తేదీ శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం జరుగుతుందని, కోర్టు పరిధిలోని సివిల్, క్రిమినల్, రోడ్డు ప్రమాదాల కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, ఎన్‌ఐ యాక్టు కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తారని తెలిపారు. కక్షదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ప్రసన్న, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆసిఫా సుల్తాన్, రాయచోటి బార్ ప్రెసిడెంట్ ప్రభాకర్, సీనియర్ న్యాయవాదులు శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసులరెడ్డి, నరసింహారెడ్డి, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రిలో పనిచేయని ఎక్స్‌రే యంత్రం


రాజంపేట ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చిన రోగులు

వైద్యసేవలు అంతంతే...

- ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యుల కొరత
- రోగులకు తగ్గట్టుగా లేని వైద్యులు, సిబ్బంది
- సమయానికి విధులకు హాజరు కాని డాక్టర్లు
- పరికరాలున్నా ఉపయోగం సున్నా...
- ప్రైవేటు ఆసుపత్రుల బాటలో రోగులు

ఆంధ్రజ్యోతి విజిట్



రాయచోటి ఏరియా ఆసుపత్రిలో తాళం వేసిన సీటీ స్కాన్ గది

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రాయచోటి ఏరియా ఆసుపత్రిలో మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 వరకు వైద్యులు విధులకు వస్తూనే ఉన్నారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలకు చెందిన 22 మంది వైద్యులు పనిచేస్తున్నారు. పీపీ యూనిట్ వైద్యులు 10 గంటలకు కూడా విధులకు హాజరు కాలేదు. సీటీ స్కాన్ లేకపోవడంతో ఆ గది మూత పడింది. ఇక్కడ ఉన్న ఆప్తాల్మిక్ అసిస్టెంట్‌ను కడపకు డిప్యుటేషన్ వేయడంతో ఇక్కడ రోగులు ఇబ్బందులు పడుతున్నారు. చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రులకు వెళుతున్నారు. ఇక్కడ పనిచేసే ఫార్మసిస్టు డిప్యుటేషన్‌పై వెళ్లారు. దీంతో ఫార్మసీలోనూ ఇబ్బందులు ఉన్నాయి. పిడియాట్రిక్ వైద్యులు సమయానికి రావడం లేదు. దీంతో చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా ఆసుపత్రి భవనం నిర్మాణం పూర్తి కాలేదు. ఇప్పటికి 70 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఆసుపత్రిలో ఆక్సిజన్ సమస్య, నీటి సమస్యలు వెంటాడుతున్నాయి. రోజుకు 800 నుంచి 900 వరకు ఓపీ ఉంటుంది. రాష్ట్రంలోని 54 ఏరియా ఆసుపత్రులలో రాయచోటి ఏ-గ్రేడ్‌లో ఉంది.

- సంబేపల్లె మండలంలో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు ఉదయం 9 గంటలకే హాజరయ్యారు. సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఒక డాక్టరు సెలవులో వెళ్లారు. ఎక్కువగా జ్వరాలతో రోగులు వస్తున్నారు. మందుల కొరత లేదు. చిన్నమండెం ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉండగా ఒకరు సెలవులో ఉన్నారు. లక్కిరెడ్డిపల్లెలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 30 పడకల ఆసుపత్రిలో తాగునీరు లేదు. రోగులు బాటిళ్లతో నీళ్లు తెచ్చుకుంటున్నారు.
- మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో నెల రోజులుగా ఎక్స్‌రే యంత్రం పనిచేయడం లేదు. అందుకు కావాల్సిన పరికరానికి ప్రభుత్వానికి ఆర్డర్ పెట్టగా ఇంకా రాలేదని వైద్యులు చెబుతున్నారు. ఎక్స్‌రే అవసరమయ్యే రోగుల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఈ క్రమంలో వారంతా బయట ప్రైవేటు సెంటర్లకు వెళ్లి తీసుకుంటున్నారు. ఆపరేషన్ థియేటర్‌లో ఏసీ లేకపోవడంతో అటు వైద్యులు, ఇటు రోగులు ఇబ్బంది పడుతున్నారు.
- మదనపల్లె మండలం సీటీఎం, బొమ్మన చెరువులలో పీహెచ్‌సీ కేంద్రాలలో జనాభా, ఇక్కడికి వచ్చే రోగులకు సరిపడా వైద్యులు, సిబ్బంది లేరు. సీటీఎం పీహెచ్‌సీ ఊరికి దూరంగా ఉండటంతో సిబ్బంది రాత్రివేళలో విధుల నిర్వహణకు భయపడుతున్నారు. ఇక్కడ వైద్య సిబ్బందే కాదు.. అటెండర్, వాచ్‌మన్ కూడా లేరు. స్టాఫ్ నర్సుపోస్టు ఖాళీగా ఉంది.
- బి.కొత్తకోట పీహెచ్‌సీ 30 పడకల నుంచి కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌గా అప్‌గ్రేడ్ అయింది. దానికి తగినట్లు సిబ్బంది, ఇతర పరికరాలు లేవు. మహిళలకు స్కానింగ్, ఎక్స్‌రే పరికరాలు లేవు. రోజుకు సుమారు 300 నుంచి 400 మంది ఓపీ రోగులు వస్తున్నారు. రాష్ట్రంలోనే ఇక్కడి పీహెచ్‌సీ రెండో స్థానంలో ఉండగా, ఆ స్థాయిలో రోగులకు వైద్యసేవలు అందడం లేదు.
- పెద్దమండ్యం పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది కొరత మినహా అన్నీ సక్రమంగానే ఉన్నాయి. పీటీఎం పీహెచ్‌సీలో సిబ్బంది కొరత రోగులను వేధిస్తోంది. ఇక్కడ హెల్త్ ఎడ్యుకేటర్ (హెచ్‌ఈ)గా పనిచేస్తున్న సరస్వతి బదిలీ కావడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. రామసముద్రంలో వైద్యులు, సిబ్బంది క్వార్టర్స్ నిరుపయోగంగా ఉన్నాయి. నిమ్మనపల్లె పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా...ఒకరే ఉన్నారు. మరొకరు డిప్యూటేషన్‌పై మదనపల్లెకు వెళ్లారు. ములకల చెరువు పీహెచ్‌సీలో 11 గంటలైనా వైద్యులు రాలేదు. ఉన్న ఇద్దరు వైద్యుల్లో ఒకరు మెటర్నటీ సెలవులో ఉండగా మరొకరు 104 సేవలకు వెళ్లినట్లు చెప్పారు. దీంతో రోగులకు బయట సిబ్బంది చికిత్స చేసి పంపారు. తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె పీహెచ్‌సీలో కొన్నేళ్లుగా స్టాఫ్‌నర్సు పోస్టు ఖాళీగా ఉంది. కమ్యూనిటీ హెల్త్ హెల్త్ ఆఫీసర్ గతేడాది రిటైర్డ్ కాగా ఆ పోస్టు ఇప్పటికీ ఖాళీగా ఉంది.


పుల్లంపేటలో వైద్యం కోసం వేచి ఉన్న రోగులు

- పీలేరు పట్టణంలోని 100 పడకల ఆసుపత్రిలో తీవ్ర నీటి సమస్య ఉంది. కొత్త భవనంలో నడుస్తున్న ఈ ఆసుపత్రిలో సరిపడా వైద్యులు, సిబ్బంది ఉన్నప్పటికీ నీటి కొరతతో ఇన్‌పేషంట్లకు ఇబ్బంది కలుగుతోంది. ఆక్సిజన్ ప్లాంటుకు పైపులు ఇంకా అమర్చకపోవడంతో రోగులకు ఆక్సిజన్ అందించలేకున్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 21 మంది వైద్యులు, 29 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఒక రేడియాలజిస్టు, ఒక జనరల్ మెడిసిన్ వైద్యుడి పోస్టు ఖాళీగా ఉన్నాయి. సగటున ప్రతిరోజూ పీలేరు ఆసుపత్రికి 700 మంది పేషెంట్లు వస్తుంటారు. ఆసుపత్రికి ప్రహరీ నిర్మించాలని వైద్యులు కోరుతున్నారు. అయితే పీలేరు పట్టణానికి ఆనుకుని రెండు జాతీయ రహదారులు ఉండగా, పీలేరు ఆసుపత్రిలో ఒక ఆక్సిడెంట్ ట్రామా కేర్ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన పదేళ్లుగా ఆచరణకు నోచుకోవడం లేదు. కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎం పోస్టు రెండేళ్లుగా ఖాళీగా ఉంది.
- రాజంపేట వంద పడకల ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ విధులకు సక్రమంగా హాజరు కావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయన తన స్వగ్రామం ఆళ్లగడ్డలో సొంత ఆసుపత్రి నడుపుకుంటుండటంతో అప్పుడప్పుడూ వచ్చి పోతున్నాడని దీంతో మిగిలిన వైద్య సిబ్బంది కూడా విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని రోగులు వాపోతున్నారు. అయితే మంగళవారం ఆంధ్రజ్యోతి పరిశీలన సమయంలో ఆయన విధులకు హాజరై ఉన్నాడు. ఈ ఆసుపత్రిలోని వైద్యులపై రోగులు పలు ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఆసుపత్రిలో సర్జన్ లేకపోవడంతో ఆపరేషన్ల కోసం రోగులు తిరుపతికి వెళ్లాల్సి వస్తోంది. ఒంటిమిట్ట ఆరోగ్య కేంద్రంలో ఎక్కువగా జ్వరపీడితులు వచ్చారు. ఇక్కడ వాటర్ ఫిల్టర్ పనిచేయకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పుల్లంపేటలో వైద్యసేవలు బాగానే అందుతున్నాయి. సుండుపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నీటికొరత ఎక్కువగా ఉంది.

జిల్లాలో ప్రజలకు సరైన వైద్య సేవలు అందడం లేదు. జబ్బు పడితే వేలాది రూపాయలు ఖర్చు పెట్టి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లలేని పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో అవసరమైన వైద్యం అందడం లేదు. పలు ఆసుపత్రులలో రోగులకు తగ్గట్టు వైద్యులు, ఇతర సిబ్బంది లేరు. వైద్యపరికరాలు ఉన్నప్పటికీ అవి ఉపయోగపడడం లేదు. పలుచోట్ల వైద్యులు సమయానికి విధులకు హాజరు కావడం లేదు. దీంతో పేదలు విధి లేని స్థితిలో ప్రైవేటు ఆసుపత్రుల బాట పట్టి జేబులకు చిల్లులు పెట్టుకుంటున్నారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆంధ్రజ్యోతి పరిశీలించింది.

అడవిపల్లి రిజర్వాయర్‌కు
6-7 నెలల్లో నీరు
- అసెంబ్లీలో మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి
6

ఉపాధ్యాయుడి సస్పెన్షన్
నాణ్యతగా రోడ్డు పనులు
6

మేమున్నామని...

- భవన నిర్మాణ కార్మికులకు అండగా...
- 400 మంది కార్మికులకు ఆర్థికసాయం
- విద్య, ఆధునిక మెలకువలపై శిక్షణ
- ఆదర్శం బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్

వారంతా రెక్కాడితే గానీ డొక్కాడని భవన నిర్మాణ కూలీలు. బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారు. ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అన్న సూక్తికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నారు పీలేరులోని బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు, నాయకులు. భవన నిర్మాణ రంగంలోని కార్మికులకు ఏ చిన్న కష్టం, నష్టం వాటిల్లినా మేమున్నాం అంటూ వారికి ఆపన్నహస్తం అందిస్తూ సాటి వారికి సాయం చేయాలంటే ధనవంతులే కావాల్సిన అవసరం లేదని, సాధారణ కూలీలు సైతం సాయం చేయవచ్చునని నిరూపిస్తున్నారు.

- వివరాలు 6లో


మృతి చెందిన కూలీ ఇబ్రహీం కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు, సభ్యులు (ఫైల్)

వేగంగా అటవీ భూముల బదలాయింపు

- ప్రతిపాదనలు త్వరితగతిన ప్రభుత్వానికి పంపాలి
- కలెక్టర్ చామకూరి శ్రీధర్


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ అభివృద్ధి పథకాల నిమిత్తం పొందిన అటవీ భూములకు పరిహారంగా భూమి బదలాయింపు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పథకాల నిమిత్తం పొందిన అటవీ భూములకు పరిహారంగా భూమి బదలాయింపు చేసే అంశంలో జాయింట్ కలెక్టర్, జిల్లా ఫారెస్టు అధికారి, సబ్ కలెక్టర్లు, ఆర్డీవో, తహసీల్దార్లు, సర్వేయర్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ అభివృద్ధి పథకాల నిమిత్తం జిల్లాలో అటవీ భూములను సేకరించడం జరిగిందని, ఇందుకు బదులుగా ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు తిరిగి అటవీశాఖకు భూమి బదలాయింపు చేసే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రహదారులు, ఇరిగేషన్ ప్రాజెక్టు, కాలువలు, మైనింగ్, ఆలయాలు తదితరాల నిమిత్తం అటవీ భూములను సేకరించినట్లు తెలిపారు. సేకరించిన భూములకు బదులుగా వేరేచోట తిరిగి అటవీ శాఖకు భూములను స్వాధీనం చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో 38 బ్లాక్‌లలో భూమి బదలాయింపునకు సంబంధించి 80 శాతం డాక్యుమెంట్స్ సిద్ధంగా ఉన్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మిగిలినవి కూడా సరైన ధృవపత్రాలతో ప్రతిపాదనలు త్వరగా సిద్ధం చేయాలని సంబంధిత తహసీల్దార్లను ఆదేశించారు. మొత్తం 38 బ్లాక్‌లకు సంబంధించి నోటిఫికేషన్ రెడీ చేసే అటవీ శాఖకు స్వాధీన పర్చడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలను త్వరితగతిన పంపాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, అటవీ అధికారి జగన్నాథ్‌సింగ్, మదనపల్లె, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నిధియాదేవి, డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్, సర్వేశాఖ ఏడీ భరత్ కుమార్, తహసీల్దార్‌లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నామని...

● భవన నిర్మాణ కార్మికులకు అండగా... ● 400 మంది కార్మికులకు ఆర్థికసాయం
● విద్య, ఆధునిక మెలకువలపై శిక్షణ ● ఆదర్శం బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్

పీలేరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ 2008లో పీలేరులో నలుగురు తాపీ మేస్త్రీలతో పురుడు పోసుకుంది. భవన నిర్మాణ రంగంలో నిరక్షరాస్యులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు ఎక్కువగా ఉండడం, అవగాహన లేమి కారణంగా శ్రమ దోపిడీకి గురవుతుండడంతో అప్పట్లో పీలేరులో పేరెన్నిక కలిగిన పలువురు తాపీ మేస్త్రీలు బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్‌ను ప్రారంభించారు. గృహ యజమానులకు, మేస్త్రీలు, కూలీలకు మధ్య ఏర్పడే తగాదాలను పరిష్కరించే వేదికగా ప్రారంభమైనప్పటికీ తదనంతర కాలంలో సామాజిక సేవా కార్యక్రమాల వారధిగా నిలిచింది. అసోసియేషన్‌లోని ఓ సభ్యుడి మదిలో మెదిలిన ఆలోచన దాదాపు 37 విభాగాల కార్మికులను సమన్వయం చేసుకుని, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 12 మండలాలకు విస్తరించి నేడు 3 వేల మంది కార్మికులకు సేవలందిస్తోంది.

400 మందికి ఆర్థిక సాయం

ఆవిర్భావం నుంచి నేటి వరకు పీలేరు బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ దాదాపు 400 మందికి ఆర్థిక సాయం అందించింది. నిర్మాణ రంగం అంటేనే ప్రమాదాలమయం. ఎటువంటి రక్షణ కవచాలు, జాగ్రత్తలు లేకుండా చాలా మంది కార్మికులు దేవుడిపై భారం వేసి జీవనాధారం కోసం పనిచేస్తుంటారు. చిన్న చిన్న అజాగ్రత్తలతో పాటు అప్పుడప్పుడు మితిమీరిన ఆత్మవిశ్వాసం, నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. ఆ ప్రమాదాల్లో కార్మికులు ప్రాణాలు కోల్పోవడం, తీవ్ర గాయాల పాలవడం, కొన్నిసార్లు అంగవైకల్యం పొందడం జరుగుతూ ఉంటుంది. అటువంటి సందర్భాల్లో వారు పనిచేస్తున్న ప్రదేశాల్లోని యజమానులు జాలిపడో, బాధ్యతగానో అందించే అరకొర సాయం, వారు పనిచేస్తున్న మేస్త్రీ అందించే సాయమే వారికి దిక్కే పరిహారం. అలా దిక్కే పరిహారంతో ఆయా కుటుంబాలు ఇబ్బందులు పడడం అసోసియేషన్ నాయకుడైన బలరాం గమనించి తమలోని సహచరుడికి ఇబ్బంది కలిగినప్పుడు ఇతరుల మీద ఆధారపడడం కంటే తామే ఎందుకు ఆదుకోకూడదని ఆలోచించి కార్మికులందరినీ ఏకతాటిపైకి తెచ్చి ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తలో చేయి వేసి సహచరులకు సాయం అందించాలని, ఆ సాయం ఒక్కసారికే పరిమితం కాకుండా వారికి అవసరమైనప్పుడల్లా ఆదుకోవాలని అందరినీ చైతన్యపరిచాడు. అలా బహుజన అసోసియేషన్‌లోని సభ్యులకు ఆర్థిక సాయం అందే ప్రక్రియ ప్రారంభమైంది. పీలేరు పరిధిలోని పీలేరు, కేవీపల్లె, కలికిరి, గుర్రంకొండ, ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు, రొంపిచెర్ల, పులిచెర్ల, సదుం, సోమల, ఐరాల, పూతలపట్టు మండలాల్లో ఏదైనా ప్రమాదం జరిగినట్లు తెలిసిన వెంటనే అసోసియేషన్ సభ్యులు అక్కడకు వెళ్లి తక్షణ సాయంగా రూ.వేయి అందిస్తారు. సంఘటనా స్థలం నుంచి ఆయా కార్మికుల స్వస్థలాలకు తీసుకెళ్లేందుకు అవసరమైన రవాణా సదుపాయం ఏర్పాటు చేస్తారు. ఆ తరువాత ప్రమాదం గురించి తమ అసోసియేషన్ గ్రూపులో పోస్టు చేసి సాయం చేయాల్సిందిగా అర్థిస్తారు. గ్రూపులోని సభ్యులు తమకు తోచిన సాయాన్ని అసోసియేషన్ నాయకులకు ఫోన్ పేగానీ నగదుగానీ అందజేస్తారు. వారం రోజుల పాటు అందరి దగ్గర వసూలు చేసి ఆయా బాధిత కార్మికులు లేదా వారి కుటుంబసభ్యులకు అందజేస్తారు. ప్రమాద తీవ్రతను బట్టి రూ.5 వేల నుంచి రూ.లక్ష దాకా వసూలు చేస్తుంటారు. అలా ఇప్పటి వరకు సుమారు 400 మందికి రూ.5 వేల నుంచి రూ.లక్ష దాకా సాయం అందించినట్లు బలరాం తెలిపారు. సగటున నెలకు రెండు కేసులు తమ దృష్టికి వస్తుంటాయని, ఎటువంటి విసుగు లేకుండా తమ అసోసియేషన్ సభ్యులు స్పందించి తగిన ఆర్థిక సాయం అందజేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా సమయంలో ఎక్కువగా ఇబ్బంది పడింది భవన నిర్మాణ రంగ కూలీలే. ఆ సమయంలోనూ తమ అసోసియేషన్ ద్వారా వందలాది మంది కార్మికులకు నిత్యావసర సరుకులు అందించి వారిని ఆకలి బాధల నుంచి తప్పించారు.


మేస్త్రీ కరీముల్లా కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

అవగాహన సదస్సుల నిర్వహణ

బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేవలం ఆర్థిక సాయం చేయడమే కాకుండా నిర్మాణ రంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న ఆధునిక పద్ధతులు, వాటిని అందిపుచ్చుకునే వైనాన్ని కార్మికులకు వివరిస్తున్నారు. పలు సంస్థలు, తిరుపతి, హైదరాబాదు వంటి నగరాల్లో ఉన్న టెక్నీషియన్లను పిలిపించి తమ సభ్యులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా వృత్తిలో మెలకువలు నేర్పిస్తున్నారు. అంతేకాకుండా పనిప్రదేశాల్లో వాడాల్సిన రక్షణ పనిముట్ల గురించి తెలియజేసి స్వంతంగా గానీ లేక దాతల సాయంతో వాటిని సమకూర్చుకుని కార్మికులకు అందజేస్తున్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వం నుంచి లభించే ప్రయోజనాలను ఎప్పటికప్పుడు వివరిస్తూ తమతో కలిసి వచ్చే కార్మికులందరినీ కార్మిక శాఖ వద్ద నమోదు చేయించి వారికి ఆయా ప్రయోజనాలను అందేలా చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా కార్మికులకు విద్య ప్రాధాన్యత వివరిస్తూ వారి పిల్లలు చదువుకునేలా చూడడమే కాకుండా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారి పిల్లలకు వివిధ పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడి ఫీజులు కూడా తగ్గిస్తున్నారు.

చట్టాలు, పథకాలపై అవగాహన



భవన నిర్మాణ రంగంలోని కార్మికులు ప్రభుత్వ చట్టాలు, పథకాలపై అవగాహన పెంచుకోవాలి. అసంఘటిత రంగంలోని భవన నిర్మాణ రంగం కూలీల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నా నిరక్షరాస్యత కారణంగా వాటిని కార్మికులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఒళ్లు హూనం చేసుకుని కష్టపడే కార్మికులు ఇతరుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడకూడదన్నది నా అభిమతం. అందుకనే ప్రమాదాల కారణంగా ఇబ్బందిపడే కార్మికులకు ఏదైనా చేయాలన్న ఆలోచనతో ఆర్థిక సాయం వితరణ ప్రారంభించాం. నా ఆలోచనను మెచ్చుకుని తోటి సభ్యులు ఇప్పటి వరకు తమకు తోచిన సాయం అందిస్తున్నారు. భవిష్యత్తులో కూడా దీనిని కొనసాగిస్తాం.

-బలరాం, అధ్యక్షుడు, పీలేరు బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్


కరోనా సమయంలో కార్మికులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం (ఫైల్)


పని ప్రదేశంలో ధరించాల్సిన హెల్మెట్లపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అసోసియేషన్ నాయకులు, సభ్యులు (ఫైల్)

ఆనందంగా ఉంది



నిర్మాణ రంగంలో బాగా సంపాదించిన వాళ్లు చాలా తక్కువ. అధిక శాతం మంది కార్మికులే. ఏ పూటకాపూట కడుపు నింపుకునే వారు ఎక్కువ. ప్రమాదాలు జరిగినప్పుడు వారు ఇబ్బంది పడుతూ ఉంటారు. మా అధ్యక్షుడి ఆలోచన కారణంగా అటువంటి వారికి అంతో ఇంతో సాయం చేసే అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉంది. వారికి అండగా ఉన్నామని తెలియజేసేందుకు సాయం అందిస్తున్నాం.

-ప్రభాకర్ రాజు, కార్యదర్శి, పీలేరు బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్

సేవా కార్యక్రమాలు చూసి...



మా సహచరులకు నిరంతరం ఆర్థిక సాయం అందించే సంఘం నాకు ఎక్కడా కనిపించలేదు. ఆ సేవా కార్యక్రమం చూసి నేను స్వచ్ఛందంగా వారితో కలిసి పనిచేస్తున్నా. ప్రమాదం జరిగిందని తెలిసినప్పుడు చిన్న చిన్న వారు సైతం తమకు తోచిన సాయం చేస్తుంటారు. ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అంటారు. ఆ పనిని భవన నిర్మాణ రంగ కార్మికులు నిజం చేసి చూపిస్తున్నారు.

-ఎస్టీఆర్ నఫీస్, పీలేరు బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్

రోడ్డు పనులు నాణ్యతగా చేయాలి

కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించిన కలెక్టర్ చామకూరి శ్రీధర్


కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో మాట్లాడుతున్న గ్రామస్థులు

చిన్నమండెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనులను నాణ్యతగా చేయాలని, నాణ్యతలో రాజీపడవద్దని కలెక్టర్ చామకూరి శ్రీధర్ కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలో పర్యటించిన కలెక్టర్ తొలుత ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. రెవెన్యూలో అసైన్డ్ భూములు, డాటెడ్ ల్యాండ్ భూముల గురించి పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం తూర్పుపల్లి దళితవాడలో 10 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు వేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. అలాగే గొర్లముదివేడు నుంచి తూర్పుపల్లి వరకు కోటి రూపాయలతో వేస్తున్న సీసీ రోడ్లను ఆయన పరిశీలించి నాణ్యతగా రోడ్లు వేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. ఉప్పరపల్లిలో ఓ వ్యక్తి సీసీ రోడ్డును తవ్వేసి అడ్డంగా గోడ నిర్మించి తమకు రహదారి లేకుండా చేశాడని, ఈ విషయం పలుమార్లు అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోలేదని వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రోడ్డును తవ్వేసిన వ్యక్తిపై కేసు పెట్టాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో శేఖర్‌నాయక్‌ను కలెక్టర్ ఆదేశించారు. దేవదాయ భూములు ఆక్రమణకు గురయ్యాయరని కలెక్టర్ దృష్టికి తీసుకుపోగా ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుని ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

సిబ్బంది నుంచి రూ.40 వేలు రికవరీ


సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ

పెద్దమండ్యం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన పనులకు సామాజిక బృందం తనిఖీలు నిర్వహించి రూ.40 వేలు రికవరీ చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. పెద్దమండ్యం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం డ్వామా పీడీ వెంకటరత్నం, ఏపీడీలు ప్రతాప్, మధుబాబు, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఏపీవో మురళి, ఎంపీపీ పూర్ణచంద్రిక రమేశ్, కో-ఆప్షన్ సభ్యుడు ఖాదర్‌వలి సమక్షంలో సామాజిక తనిఖీ బృందం బహిరంగ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో జరిగిన పనులకు ఈనెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు సామాజిక బృందం పనులను తనిఖీ చేశారు. ఉపాధి పనుల మస్టర్‌లలో సంతకాలు లేకుండా చెల్లింపు, అదనపు చెల్లింపులు, ఎక్కువ పనిచేసిన వారికి తక్కువ చెల్లింపులతో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఉపాధి సిబ్బంది నుంచి రూ.40 వేలు రికవరీ చేయించాలని తేల్చినట్లు వెల్లడించారు. నలుగురు ఉపాధి సిబ్బందికి రూ.5 వేలు జరిమానా విధించారు. ఉపాధి నిధులతో నాటిన మామిడి తోటల్లో సుమారు రూ.2 లక్షల విలువ చేసే మామిడి చెట్లు ఎండిపోయాయి, ఎండిన మొక్కల స్థానంలో పచ్చని మొక్కలను రైతుల నుంచి నాటించాలని ఉపాధి సిబ్బందిని డ్వామా పీడీ ఆదేశించారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

రాయచోటి టౌన్/ సుండుపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించినట్టు ఆరోపణలు ఎదుర్కొన్న బుర్రలదిన్నె పాఠశాల ఉపాధ్యాయుడు నాగముని నాయక్‌ను సస్పెండ్ చేస్తూ డీఈవో కె.సుబ్రమణ్యం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. టి.సుండుపల్లె మండలం బుర్రలదిన్నె పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న నాగముని నాయక్ విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడంటూ ఫిర్యాదులు అందడంతో విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక సమర్పించామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయనను సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అడవిపల్లి రిజర్వాయర్‌కు 6-7 నెలల్లో నీరు

● అసెంబ్లీలో మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి

అమరావతి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా సుజల స్రవంతి పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఇటీవలే సమీక్ష సందర్భంగా ఆదేశించారని, ఆ కాలువ చివరి ప్రాజెక్టు అయిన అడవిపల్లి రిజర్వాయర్‌కు ఆరేడు నెలల్లో నీరు వస్తుందని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. మంగళవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి తన నియోజకవర్గంలోని అడవిపల్లి రిజర్వాయర్ గురించి ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు 2019లో ముఖ్యమంత్రిగా దిగిపోయే నాటికి రూ.2,500 కోట్లు ఖర్చు చేసి పూర్తిచేసిన ఈ జలాశయంలోకి కేవలం రూ.280 కోట్లు పెడితే నీరు వస్తుందన్నారు. ఒకచోట పదెకరాలు, మరోచోట ఆరెకరాలు భూసేకరణ పెండింగ్ వల్ల హంద్రీ-నీవా కాలువ పనులు సాగడం లేదని గత ఐదేళ్లు 82 వేల ఎకరాలకు సాగునీరు అందకుండా పోయిందని వాపోయారు. ఇదే సమయంలో రాష్ట్రంలో ఎక్కడికక్కడ సాగునీటి కాలువలకు మరమ్మతులు చేయలేదని పలువురు ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. నిమ్మల స్పందిస్తూ అడవిపల్లి రిజర్వాయర్‌కు ఆరేడు నెలల్లో నీరు వస్తుందన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి ఊళ్లకు ఊళ్లను ముంచేస్తే జగన్ సర్కారు పట్టించుకోలేదని మండిపడ్డారు. గత ఐదేళ్లలో సాగునీటి రంగం పూర్తి నిర్లక్ష్యానికి గురైందని.. దీనికి మరమ్మతు చేసేందుకు సీఎం చంద్రబాబు ప్రణాళికాబద్ధంగా శ్రమిస్తున్నారని తెలిపారు. కరువు ప్రాంత భూములకూ నీరిస్తామని స్పష్టం చేశారు.

పంట మార్పిడితో మంచి దిగుబడులు



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్

ములకలచెరువు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పంట మార్పిడి పద్ధతితో మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయశాఖాధికారి చంద్రానాయక్ తెలిపారు. మండలంలోని బురకాయలకోటలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట సాగు చేసిన రైతులు తరువాత పంట మార్పిడి చేసి మొక్కజొన్న పంట సాగు చేస్తే పెట్టుబడి ఖర్చులతో పాటు ఎక్కువ ఆదాయం పొందచ్చన్నారు. రబీలో వరి, వేరుశనగ పంట సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా డిసెంబరు 15వ తేదీ లోగా పంటల బీమాను చేయించుకోవాలన్నారు.

అనంతరం పంటల సాగుపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏవో రమేష్‌రాజు, మండల వ్యవసాయాధికారి లీలాకుమారి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మల్లయ్యకొండ కోనేరు వెలవెల...

● నీటి తొట్టి వద్ద స్నానమాచరించి దర్శనానికి వెళుతున్న భక్తులు ● పట్టించుకోని దేవదాయశాఖ అధికారులు

తంబళ్లపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తంబళ్లపల్లె సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ జిల్లాలోనే పురాతన శైవక్షేత్రాల్లో ప్రసిద్ధి గాంచింది. కార్తీక మాసంలో మల్లయ్యకొండకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. తలనీలాలు సమర్పించిన వారు, భక్తులు, మాలదారులు కొండపైన ఉన్న కోనేరులో స్నానమాచరించి అనంతరం స్వామి వారిని దర్శించుకుంటారు. అయితే, కొన్నిరోజుల ముందు కోనేరులోని నీరు దుర్గంధంగా మారి అపరిశుభ్రంగా ఉండటంతో దేవదాయశాఖ సిబ్బంది శుభ్రపరచారు. అప్పటి నుంచి కోనేరుకు నీరు పట్టకపోవడంతో భక్తులు సమీపంలో ఉన్న నీటి తొట్టెలో స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తలనీలాలు సమర్పించిన వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. కోనేరులో నీరు లేకపోవడంతో నీటి తొట్టిలోని నీటితోనే స్నానం చేయాల్సి వస్తోంది. పలువురు భక్తులు కోనేరులో ఉన్న అరకొర నీటిలోనే శివ..శివ.. అంటూ తల తడుపుకుని స్వామిని దర్శించుకుంటున్నట్లు వాపోతున్నారు. ప్రతి ఏటా భక్తులు సమర్పించిన హుండీ కానుకలు, వేలం పాటల ద్వారా మల్లయ్యకొండకు లక్షల్లో ఆదాయం వస్తున్నా భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో దేవదాయశాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని భక్తులు వాపోతున్నారు. వెంటనే కోనేరును నీటితో నింపాలని భక్తులు కోరుతున్నారు.

రోడ్డును కమ్మేసిన పిచ్చిమొక్కలు

మద్దాతంబావి నుంచి మల్లయ్యకొండ పైకి ఉన్న ఘాట్ రోడ్డును పలుచోట్ల పిచ్చిమొక్కలు కమ్మేశాయి. ప్రతి సోమవారం వందల సంఖ్యలో ద్విచక్రవాహనాలు, కార్లు, జీపులు, ట్రాక్టర్లతో పాటు ఆర్టీసీ బస్సులు కొండకు తిరుగుతుంటాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల రోడ్డుకు ఇరువైపులా, మలుపుల వద్ద పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి ఘాట్ రోడ్డు పైకి వచ్చాయి. దీంతో మలుపుల్లో వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాలు చోటుచేసుకోక ముందే మలుపుల వద్ద, రోడ్డు పైకి వచ్చిన పిచ్చిమొక్కలు తొలగించాలని వాహనదారులు, భక్తులు కోరుతున్నారు.

రెండు రోజుల్లో నీటిని నింపుతాం

కోనేరులో పూలు, ఆకులు ఎక్కువగా ఉండటంతో ఇటీవలే సిబ్బంది నీటిని తీసివేసి శుభ్రపరచారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా కోనేరుకు సమీపంలో నీటిని ఏర్పాటు చేశాం. రెండు రోజుల్లో తప్పకుండా కోనేరులో నీటిని నింపుతాము.

- మునిరాజ. ఈవో, మల్లయ్యకొండ, తంబళ్లపల్లె




కోనేరులో ఉన్న అరకొర నీటిలోనే స్నానాలు చేస్తున్న భక్తులు - నీటి తొట్టి వద్ద స్నానమాచరిస్తున్న భక్తులు - మల్లయ్యకొండకు వెళ్లే ఘాట్ రోడ్డు పైకి పెరిగిన పిచ్చిమొక్కలు

దేవాలయ రోడ్డు పనుల పరిశీలన


రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఈఈ సూర్యచంద్రారెడ్డి

రామసముద్రం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలంలోని వాళీశ్వరస్వామి, గట్టు వెంకటేశ్వరస్వామి దేవాలయాలకు వెళ్లే రోడ్డు పనులు జరుగుతుండగా వాటిని చిత్తూరు జిల్లా క్వాలిటీ కంట్రోలర్ ఈఈ సూర్యచంద్రారెడ్డి మంగళవారం పరిశీలించారు. చెంబకూరు మెయిన్ రోడ్డు నుండి గట్టు వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు సుమారు రూ.80లక్షలతో, వాళీశ్వరస్వామి కొండకు వెళ్లే రోడ్డు రూ.2కోట్లతో పనులు జరుగుతుండగా వీటిని ఈఈ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ టూరిజం అభివృద్ధి కార్యక్రమం కింద ఈ ఆలయాలకు రోడ్డు కల్పించడం ద్వారా ఆలయాల అభివృద్ధి జరుగుతుందన్నారు. రోడ్డు పనులలో నాణ్యత లోపం లేకుండా జరుగుతున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి వాళీశ్వరస్వామి ఆలయ రోడ్డు పనులు పూర్తి కావాలని ఈఈ తెలిపారు. ఈకార్యక్రమంలో క్వాలిటీ కంట్రోలర్ డీఈ భాస్కర్, మదనపల్లె పంచాయతీ రాజ్ డీఈఈ శివప్రసాద్, ఏఈ నిరంజన్‌రెడ్డి, కాంట్రాక్టర్ గౌనివారి రెడ్డెప్పరెడ్డి, మాజీ జడ్పీటీసీ కృష్ణంరాజు, స్థానికం రాజేష్, మిట్టపల్లె నాగరాజ పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లరు అరెస్టు

దుంగలు, వాహనం స్వాధీనం



ఎర్రచందనం దుంగలు, వాహనం, నిందితులతో ఎఫ్ఆర్ఓ నయీం అలీ తదితరులు

బద్వేలు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొంగళవీడు సమీపంలో రవాణాకు సిద్ధంగా ఉంచిన వాహనం సహా ఏడు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు ఫారెస్టురేంజ్ ఆఫీసరు కేఎన్ నలీంఅలీ తెలిపారు. డీఎఫ్ఓ వినీత్‌కుమార్, సబ్ డీఎఫ్ఓ స్వామి వివేకానంద ఆదేశాల మేరకు ఎర్రచందనం అక్రమ రవాణా నివారణలో భాగంగా నిర్వహించిన తనిఖీల్లో కొంగళవీడు వద్ద వాహనంలో ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా జరుగుతోందని అందిన సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. దాడుల్లో టాటా ఏసర్, ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని కర్ణాటక రాష్ట్రం కటికనహళ్లికి చెందిన సయ్యద్ ముబారక్‌ను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో శేషయ్య డిప్యూటీ ఫారెస్టురేంజర్, ఎఫ్‌బీఓ సువర్ణకుమార్, రాజేశ్‌రెడ్డి, ఏబీఓ షాజహాన్ పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. పట్టుబడిన దుంగల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని తెలిపారు.

సిమెంట్ రోడ్ల నిర్మాణాలు నాణ్యతగా చేపట్టాలి

● ఏపీఆర్ఆర్‌పీ అడ్వైజర్లు నరసింహారావు, ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏపీఆర్ఆర్‌పీ అడ్వైజర్ ప్రభాకర్‌రెడ్డి

కడప రూరల్, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం (ఎంజీఎన్ ఆర్ ఈ జీ ఎస్) ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే సిమెంట్ రోడ్ల నిర్మాణాలను నాణ్యత, పారదర్శకంగా చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్ ప్రాజెక్టు అడ్వైజర్లు వైనరసింహారావు, కె. ప్రభాకర్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కడప నగరంలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో సీసీ రోడ్ల నాణ్యతా ప్రమాణాలపై అవగాహన చేపట్టిన వారు మాట్లాడుతూ పల్లెసీమల ప్రగతికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం వరంలాంటిదన్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల రహదారులకు మహర్దశ ఏర్పడుతుందన్నారు. ప్రస్తుత కేంద్ర రాష్ట్రాల పాలనలో వైఎస్ఆర్ జిల్లాలో దాదాపు రూ.75 కోట్ల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రోడ్ల నిర్మాణాలను చేపడుతున్నారన్నారు. ఇందులో సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు ఎక్కువగా ఖర్చు చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి ఎస్టిమేట్ ఎలా ప్రిపేర్ చేయాలి, నేమ్ఆఫ్‌ది వర్కు, ఎస్టిమేట్ కాస్ట్, అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ తదితర అంశాలపై పవర్ ప్రజెంటేషన్ ద్వారా ఉమ్మడి కడప జిల్లాలోని డీఈలు, ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు రెండు విడతలుగా శిక్షణను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మంగళవారం పీఆర్ ఎస్ఈ కార్యాలయంలోని సమావేశ హాలులో రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, కమలాపురం, మైదుకూరు, బద్వేల్ నియోజకవర్గాల పరిధి అధికారులకు శిక్షణ ఇచ్చి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను సిమెంటు రోడ్ల నిర్మాణాలు చేపట్టేటప్పుడు పరిగణలోకి తీసుకోవాలన్నారు. రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, కమలాపురం, మైదుకూరు, బద్వేల్ నియోజకవర్గాల పరిధి డీఈలు, ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు 24లోగా దరఖాస్తు చేసుకోండి

కడప మారుతీనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు అర్హత గల జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 24లోగా దరఖాస్తు చేసుకోవాలని కడప బీసీ స్టడీ సంచాలకులు కృష్ణయ్య తెలిపారు. విజయవాడలోని గొల్లపూడి వద్దవున్న బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ కోసం ఈనెల 24లోగా కడప పాత కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు. 27న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ఉత్తీర్ణులకు మెరిట్ ఆధారంగా విజయవాడలో శిక్షణ ఇస్తారన్నారు. బీసీలకు 66శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 14 శాతం రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేసి ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. కావున సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు దరఖాస్తు చేసే అభ్యర్థులు బయోడేటా సహా టెన్త్, ఇంటర్, డిగ్రీ, మార్కులిస్టులు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 1 లక్ష లోపు మాత్రం, వుండాలన్నారు. వీటితో పాటుగా ఆధార్, బ్యాంక్‌పాస్ బుక్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జతపరచి తమ కార్యాలయంలో దరఖాస్తులివ్వాలన్నారు. వివరాలకు 9849919221, 9966418572ను సంప్రదించాలన్నారు.

వారసత్వ సంపదలో దేశంలోనే మేటి కడప



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య జి.సాంబశివారెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వారసత్వసంపద విషయంలో కడప జిల్లా దేశంలోనే మేటిగా నిలుస్తుందని ప్రముఖ చరిత్రకారులు ప్రొఫెసర్ జి.సాంబశివారెడ్డి అన్నారు. మంగళవారం కడప నగరంలోని పాత కలెక్టరేట్ ఆవరణలోని ఇంటాక్ కార్యాలయంలో ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో మన జిల్లాలో ఉన్నన్ని వారసత్వ ప్రదేశాలు, సంపద మరెక్కడాలేవన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనన్నారు. చింతకుంట చిత్రాలను కాపాడుకునేందుకు ఇన్‌టాక్ కోర్టు వరకు వెళ్లి విజయం సాధించిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు పోతుల వెంకట్రామిరెడ్డి, పూర్వకో కన్వీనరు వేణుగోపాల్, సంస్థ పూర్వకన్వీనరు ఎలియాస్‌రెడ్డి, పలువురు ఇన్‌టాక్ సభ్యులు పాల్గొన్నారు.

ఆధార్‌తో ఖాతాల అనుసంధానానికి 30 వరకు గడువు

పోస్టల్ సూపరింటెండెంట్ కిరణ్ వెల్లడి

ప్రొద్దుటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలసొమ్ము ను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి పొందాలంటే ఆధార్‌తో ఖాతాలను అనుసంధానం తప్ప నిసరి అని పోస్టల్ సూపరింటెండెంట్ కిరణ్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడు తూ సుమారు 65 లక్షల మంది లబ్ధిదారులకు ఎన్‌పీసీఐ మ్యాపర్‌లో ఆధార్ సీడింగ్ లేక పోవడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని అన్ని తపాలా కార్యాలయాల్లో ఆధార్‌తో ఖాతాల అనుసంధానప్రక్రియ నవంబరు 30 వరకు చేస్తారన్నా రు. 18 ఏళ్లు నిండి ఖాతాలేని ప్రతి లబ్ధిదారునికీ కొత్త ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ అకౌంట్ ఆధార్ అనుసంధానంతో ఓపెన్ చేయాలన్నారు. ఇందుకోసం కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు ఏర్పాటు ఉంటుందన్నారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రూ.61.36 లక్షల నిధుల దుర్వినియోగం

వైసీపీ మాజీ సర్పంచ్ దేవీప్రసాద్‌రెడ్డిపై కేసు నమోదు

ప్రొద్దుటూరు నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గోపవరం పంచాయతీ వైసీపీ మాజీ సర్పంచ్ కుప్పిరెడ్డి దేవీ ప్రసాద్‌రెడ్డి రూ. 61.36 లక్షల నిధుల దుర్వినియోగంపై క్రిమినల్ కేసు నమోదైనట్లు రూరల్ సీఐ బాలమద్దిలేటి తెలిపారు. వివరాల్లోకెళితే... 2016-17లో గోపవ రం పంచాయతీలో రోడ్లు వేయకున్నా వేసినట్లు అప్పటి సర్పంచ్ దేవీప్రసాద్‌రెడ్డి బిల్లులు చేసుకున్నారు. దీనిపై కొందరు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ జడ్పీ సీఈఓను విచారణ అధికారిగా నియమించారు. ఆవిచారణలో రోడ్డువేయకున్నా వేసినట్లు తప్పుడు బిల్లులు చేసుకున్నట్లు తేలింది. తరువాత వైసీపీ ప్రభుత్వంలో ఆ విచారణ నివేదిక అట కెక్కింది. కొందరు లోకాయుక్తలో కేసు వేయడంతో కొన్ని నెలలుగా విచారణ జరిగింది. నిధుల దుర్వినియోగంపై సదరు బాధ్యులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ నిధులు రికవరీకి లోకాయుక్త ఆదేశించింది. దీంతో లోకాయుక్త ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ తిమ్మక్క రూరల్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తిమ్మక్క ఫిర్యాదుపై మాజీ వైసీపీ సర్పంచ్ కుప్పిరెడ్డి దేవీప్రసాద్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యువకుడిని చితకబాదిన పలువురిపై కేసు నమోదు

బద్వేలుటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీఎస్ఐ చర్చి సమీపంలో మంగళవారం యువకుడిని నలుగురు వ్యక్తులు చితకబాదిన సంఘటన బద్వేలులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు హర్షవర్ధన్ వస్తుండగా బైక్ ఢీ కొనడంతో జాఫర్, నాయబ్, ఓబులేసు, మరొకరు చితకబాదారు. దీంతో హర్షవర్ధన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు.

పేట్రేగుతున్న కబ్జాల పర్వం



మైసూరివారిపల్లె ఏటిపోరంబోకు స్థలంలో నాటిన మామిడి మొక్కలు

రైల్వేకోడూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో కోట్లు విలువైన వంక, ఏటిపోరంబోకు స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయి. ఈ కబ్జాల పర్వం చాలా రోజులుగా సాగుతోంది. చివరకు ఏట్లో ఇసుకనూ వదలడం లేదని స్థానికులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో కబ్జాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. వివరాల్లోకెళితే.... రాఘవరాజపురం పంచాయతీలోని గంగరాజపురం ప్రధానదారిలో కొందరు వ్యక్తులు ఇటీవల రాత్రికి రాత్రే కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కట్టడాలు చేశారు. ఫలితంగా ఇరు రాజకీయ పక్షాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్నాయి. పంచాయతీలోని స్థానికులు, గంగరాజపురంలోని ఆక్రమణదారులకు మధ్య విపరీతంగా గొడవలు జరిగాయి. దీంతో రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడాలను నిలిపి బోర్డు నాటారు. గంగరాజపురం వద్ద ప్రధానదారిలో ఉన్న ప్రభుత్వ వంక పోరంబోకు స్థలం సుమారు రెండెకరాలు ఉంది. ఇది సుమారు రూ. 5కోట్లు విలువ చేస్తుంది. ఈ భూమికి గతంలో సర్వే నెంబరు 38/1 ఉండేది. రీసర్వేలో భాగంగా ఎల్‌పీ నెం. 178గా మారిందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇరిగేషన్‌శాఖ పరిధిలో వంక, ఏటి పోరంబోకు స్థలా లున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణ లున్నాయి. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల మధ్య సమ న్వయం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇద్దరి భాగస్వామ్యంతో కోట్లు విలువైన ప్రభుత్వ వంక, ఏటి పోరంబోకు స్థలాలను కాపడుకోవచ్చని ప్రజ లు అంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో కబ్జాల పర్వం అత్యధికంగా నడిచింది. అదే తంతును కూ టమి ప్రభుత్వం కూడా చేస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. ఏట్లో ఇసుక, రాళ్లు, మట్టి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. లక్షలు విలువైన ఏటి వనరులను దోచుకుంటున్నారు. నియోజ కవర్గంలో వైసీపీ, కూటమి మిలాఖత్ కావడంతో కబ్జాలు ఎక్కువగా సాగుతున్నాయి. ఇదిలా ఉండగా మైసూరివారిపల్లె పంచాయతీకి ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ పెద్దఎత్తున నిధుల వర్షం కురిపించారు. అక్కడ రూ. 60 లక్షలు పెట్టి ఆట స్థలం కోసం పొలాన్ని తీసుకున్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో రోడ్లు, డ్రైనేజి వ్యవస్థ, పాఠశాలకు వసతులు, క్రీడా మైదానం, తదితర వాటిని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ పంచాయతీపై ప్రేమ కురిపించిన పవన్‌కల్యాణ్‌కు చెడ్డ పేరు తీసుకువచ్చేలా కబ్జా పనులు సాగుతున్నాయి. సర్వే నెంబరు 2085లో 17.54 ఎకరాల వంక పోరంబోకు స్థలం ఉంది. వైసీపీ ప్రభుత్వంలో ఈ భూమిపై పలువురు కన్నేశారు. వైసీపీ ప్రభుత్వంతో మైసూరివారిపల్లె ప్రజలు, జనసేన నేతలు పెద్దగా పోరాడారు. అయినా సుమారు ఐదెకరాలు కబ్జాకు గురైంది. కూటమి ప్రభుత్వం రాగానే కొందరు నేతల అండతో ఇదే సర్వే నెంబరులో మిగిలిన వంక పోరంబోకు స్థలాన్ని కబ్జా చేశారు. ఈ విషయంపై ఉన్నత స్థాయి కూటమి నేతలకు సమాచారం వెళ్లింది. అధికారులు కూడా ఏమీ చేయలేక తలలుపట్టుకుంటున్నారు. అధికారులు వంక, ఏటి పోరంబోకు స్థలాలకు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పట్టాలు ఇచ్చే సాహసం చేయలేకున్నారు. గతంలో అధికారులు వైసీపీ పెద్దలు చెప్పినట్లు అధికారులు తలలు ఆడించారు. దీంతో కూటమి ప్రభుత్వంలోనూ అధికారులపై కేసులు నమోదు అవుతుండడం కూటమి నేతలకు తెలియదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు మంచి ప్రభుత్వాన్ని ఇస్తామని, ఎక్కడా కబ్జాలకు తావు లేకుండా చేస్తామని నేతలు హామీలు ఇచ్చి నేడు వారే చేస్తే ఎలా అనే ప్రశ్నలు ఎదురవడం కొసమెరుపు.



ఇటీవల గంగరాజపురం వద్ద ఆక్రమణలపై చోటుచేసుకున్న వివాద దృశ్యం - గంగరాజపురం వద్ద వంకపోరంబోకు స్థలానికి బోర్డు నాటిన రెవెన్యూ అధికారులు

చర్యలు తీసుకుంటాం

కబ్జా దారులపై చర్యలు తీసుకుంటాము. కబ్జాకు గురైన ప్రాంతంలో కట్టడాలు, పండ్ల మొక్కలు ఉంటే మాత్రం తొలగిస్తాము. వంక, ఏటి పోరంబోకు స్థలాలను కబ్జాలు చేస్తే మాత్రం చట్టరీత్యా చర్యలు తీసుకుంటాము.

మహబూబ్ చాంద్,
తహసీల్దారు రైల్వేకోడూరు

విధివంచిత ఆ నవ వధువు

కాళ్ల పారాణి ఆరకముందే మృత్యు కౌగిట్లోకి స్వాతి ● తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు



నవవధువుగా... విగత జీవిగా స్వాతి

పెద్దముడియం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆనందంగా జీవితాన్ని అనుభవించాలని, కొత్త వైవాహిక జీవితంలో ఉండే అనుభూతులు, అనుభవాలు ఆస్వాదిస్తూ భర్తతో కలిసి నూరేళ్ల జీవితాన్ని గడపాలని ఆమె ఊహించుకుంది. బిడ్డల పెరుగుదల, వారికి కల్పించే సదుపాయాలపై ఒకింత అవగాహనకు వచ్చింది. ఇలా భర్తతో వివాహ జీవితంపై ఎన్నో ఆశలు పెంచుకుంది. కాళ్ల పారాణి ఆరకముందే కాలం కాటేయడంతో విధి చేతిలో నవవధువు స్వాతి(20) ఓడింది. పెళ్లి జరిగిన ఇంట కట్టిన మామిడి తోరణాలు వాడకముందే పెళ్లి భాజా మోగి 24గంటలు తిరగకముందే చావు మేళా మోగింది. ఈ హృదయ విదారక ఘటన పెద్దముడియంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సుబ్బారావు అందించిన వివరాల్లోకెళితే...

పెద్దముడియం గ్రామానికి చెందిన హేమంత్‌కు పెండ్లిమర్రి మండలానికి చెందిన స్వాతితో 17న పెద్దముడియంలో వరుడి స్వగృహంలో బంధువుల సమక్షంలో వివాహం జరిగింది. వేడుక జరిగిన వెంటనే బంధువులంతా ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. 18వతేదీ సోమవారం మళ్లిపెళ్లి జరగాల్సి ఉంది. కాగా 18న సోమవారం ఉదయం నిద్రలేచిన స్వాతి స్పృహ తప్పి ఒక్కసారిగా కుప్పకూలింది. గమనించిన వరుడు హేమంత్ కుటుంబీకులు స్వాతిని హుటాహుటిన చికిత్స కోసం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆ వధువు తనువు చాలించింది. వరుడు, వారి బంధువుల సమాచారంతో మృతురాలి తల్లిదండ్రులు సంఘటనాస్థలం పెద్దముడియం చేరుకున్నారు. నవవధువు స్వాతిని విగతజీవిగా చూడడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. చూసిన వారు అయ్యో పెళ్లింట్లో ఇంత విషాదమా అంటూ విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు మృతురాలి తండ్రి ఓబన్న పెద్దముడియం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మొత్తమ్మీద పెళ్లింట ఇలా 24గంటలు గడవకముందే ఇలాంటి దారుణం చోటు చేసుకోవడంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రీమియం చెల్లింపు నమోదు ప్రారంభం

కామన్ సర్వీస్ సెంటర్‌లో నమోదు ● బ్యాంకు ద్వారానే చెల్లింపు ● డిసెంబరు 15 వరకు గడువు

కడప రూరల్, నవంబర్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీపంటలకు సంబంధించి 2024-25కు పంటల బీమా, ఫసల్ బీమా(పిఎంఎఫ్‌బీవై) పథకాల్లో పంటల వారీగా ప్రీమియం చెల్లింపు నమోదు ప్రారంభమైంది. పంట రుణాలు పొందని రైతులు నేరుగా చెల్లించేందుకు సమీప(సీఎస్‌సీ) కామన్ సర్వీస్ సెంటర్‌లో నమోదు చేసుకోవాలి. పంట రుణ గ్రహీతలు, రైతులు నేరుగా బ్యాంకు ద్వారానే చెల్లించాల్సి ఉంది. రబీలో బ్యాంకు ద్వారా పంట రుణాలను పొందని రైతులు సీఎస్‌సీ ద్వారా ప్రీమియం చెల్లించాలి. నేరుగా ప్రీమియం చెల్లించే రైతులు ఆధార్, బ్యాంకు పాస్‌బుక్, పట్టాదారు పాసుబుక్, పంట ధ్రువీకరణ పత్రం, అధార్ అనుసంధానమైన మొబైల్ నెంబర్ వివరాలను జతపరుస్తూ నమోదు చేసుకోవాలి. రైతులు స్వయంగా ఎన్‌సీఐపీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవడానికి వీలుకల్పించారు. ప్రీమియం చెల్లించడానికి 2024 డిసెంబరు 15వ తేదీ వరకు గడువు కల్పించా రు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన రైతు సోదరులంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. నోటిఫైడ్ క్రాఫ్ రబీ 2024-25కు రైతు వాటా ప్రీమియం ధరలు

సీ.నెం	పంట	బీమాయూనిట్	నష్టపరిహారం	బీమామొత్తం	స్థూలప్రీమియం	సెంట్రల్	రాష్ట్రం	రైతు	హెక్టారుకు	ఎకరాకు
1	వరి	ఎంఐయు	80శాతం	రూ.1050000	3.00 శాతం	0.75	0.75	1.50	రూ. 1575	రూ. 638
2	శనగ	ఎంఐయు	70 శాతం	రూ.80000	17.97 శాతం	8.24	8.24	1.50	రూ. 1200	రూ. 486
3	వేరుశగ	ఎంఐయు	80శాతం	రూ.80000	3.00 శాతం	0.75	0.75	1.50	రూ.1200	రూ. 486
4	జొన్న	ఎంఐయు	80 శాతం	రూ.52500	3.00 శాతం	0.75	0.75	1.50	రూ.787.5	రూ. 319
5	పచ్చిమిర్చి	డీఐయు	80శాతం	రూ.45000	2.00శాతం	0.25	0.25	1.50	రూ.675	రూ. 273
6	బ్లాక్‌గ్రామ్	ఎంఐయు	80శాతం	రూ.47500	6.00 శాతం	2.25	2.25	1.50	రూ.712.5	రూ. 288
7	సీసమ్	ఎంఐయు	80శాతం	రూ.30000	3.00 శాతం	0.75	0.75	1.50	రూ.450	రూ. 182
8	సన్‌ఫ్లవర్	ఎంఐయు	80శాతం	రూ.50000	5.00 శాతం	1.75	1.75	1.50	రూ.750	రూ. 304

సంస్థలను తరలించే పద్ధతికి స్వస్తి పలకాలి

లేదంటే ఉద్యమానికి సన్నద్ధం ● రౌండ్ టేబుల్ సమావేశంలో ఆర్‌సీపీ, సీపీఐ నేతలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

కడప మారుతీనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ఏర్పాటైన వివిధ సంస్థలను అమరావతికి తరలించే పద్ధతికి ప్రభుత్వం స్వస్తి పలకాలని రాయలసీమ కమ్యూనిస్టుపార్టీ (ఆర్‌సీపీ) రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రవిశంకర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో రాయలసీమలోని సంస్థలను అమరావతికి తరలించడాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మిగతా ఏ ప్రాంతానికీ జరగనంత అన్యాయం సీమకు మాత్రమే జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చెన్నూరు చక్కెర ఫ్యాక్టరీ, కడప పేపర్ మిల్లు, కాటన్ మిల్లు, లంకా కేబుల్, జ్యోతి కెమికల్, నందలూరు ఆల్విన్ ఫ్యాక్టరీ, ప్రొద్దుటూరు పాలకేంద్రం మూసివేస్తూ ఇక్కడి ప్రజల జీవనోపాధిని దెబ్బతీస్తున్న తీరు దారుణమన్నారు. బ్యాంకుల విలీనం పేరుతో కడప ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ అమరావతికి తరలించేలా చేస్తున్న సన్నాహాలు సరైందికాదన్నారు. రూ.250 కోట్ల కేంద్ర నిధులతో కడపలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈని సైతం అమరావతికి తరలించేలా జీఓ తీసుకురావడం విడ్డూరంగా వుందన్నారు. కర్నూలులోని మానవ హక్కుల, లోకాయుక్త కార్యాలయం, సీబీఐ కోర్టును కూడా తరలించే ప్రక్రియకు శ్రీకారం చుట్టడం దారుణమన్నారు. 15 ఏళ్ల కిందట కడపలో ఏర్పాటు చేసిన స్టీల్ ప్లాంట్‌కోసం అవసరమైన నిధులు కేటాయింపు చేయకపోగా, పేరుకు మాత్రమే సూపర్ స్పెషాలిటీ అందులో ఒక డాక్టర్‌కూడా వుండరు, పరికరాలుండవని, అంతలా కడపలో వైద్య రంగం భ్రష్టుపట్టిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచీ ఒక్క నంద్యాల రైలు మార్గం తప్ప మరో రైలు మార్గం అంటే తెలియని స్థితిలో వున్నామన్నారు. 1983లో తెలుగుగంగ, హంద్రీనీవా, గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్ట్ నేటికీ అసంపూర్తిగా వుండడం సీమ ప్రజల దౌర్భాగ్యమన్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్ నీటిని మినిమం బ్యాలెన్స్ మెయిటెనెన్స్ చేయకుండా వున్న నీటిని తోడేస్తున్న తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్‌సీపీ నగర కార్యదర్శి మగ్బుల్‌బాషా, లోక్‌సత్తా, జనతాదళ్ నాయకులు కృష్ణయ్య, ప్రతాప్‌రెడ్డి, దళిత, గిరిజన హక్కుల పోరాట సంఘం నేతలు వెంకటేష్, ప్రసాద్, రమేష్, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

సీమ స్థాయి క్రీడల్లో సత్తా చాటిన గురుకుల విద్యార్థులు

లింగాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ స్థాయి జోన్-4 క్రీడల్లో ఇప్పట్ల గురుకుల కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. 14 నుంచి 18 వరకు జరిగిన పోటీల్లో సీనియర్ ఇంటర్ విద్యార్థులు డిస్క్ త్రోలో మొదటిస్థానం నిర్మలజ్యోతి, జావెలిన్ త్రోలో తృతీయస్థానం, కె. అనూష, చెస్‌లో ద్వితీయ స్థానం ఎం.శ్రావణి, లాంగ్‌జంప్‌లో నాలుగోస్థానంలో ఎస్.శ్రీవాణి, త్రోబాల్‌లో కె.అనూష టీం రన్నర్స్‌గా నిలిచారు. జూనియర్ ఇంటర్ విభాగంలో వంద మీటర్లు రన్నింగ్‌లో వి.భవ్య ద్వితీయస్థానం, రెండు వందల మీటర్ల రన్నింగ్‌లో వి. భవ్య మొదటి స్థానం, క్యారమ్స్‌లో టి.సింధు, కె.అలేఖ్యలు విన్నర్స్‌గా నిలిచారు. 1500 మీటర్ల ర్నింగ్‌లో టి.షర్మిల తృతీయస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులందరిని కళాశాల ప్రిన్సిపాల్ సత్యవతమ్మ తదితరులు అభినందించారు.

రేపు బండలాగుడు పోటీలు

సికెదిన్నె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఊటుకూరు కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. ఓల్డ్ కేటగిరీ ఎద్దుల బండలాగుడు పోటీల్లో మొదటి బహుమతి రూ.40వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, 4వ బహుమతి రూ.10 వేలు, 5వ బహుమతి రూ.5 వేలు, 6వ బహుమతి రూ.3 వేలు అందించనున్నట్లు తెలిపారు. 20వ తేదీ యాగశాల, యజ్ఞయాగాదులు, 21న హోమాలు, ప్రత్యేక పూజలు, 22 విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

చెన్నూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొక్కిరాయపల్లె వెళ్లే దారిలోని బయోమాస్‌ప్లాంటు వద్ద మంగళవారం ఆటో ఢీకొనడంతో రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. రామాంజనేయులు వ్యక్తిగత పని నిమిత్తం కొక్కిరాయపల్లె నుంచి బైక్‌లో చెన్నూరుకు వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ సంఘటనలో రామాంజనేయులు కాళ్లు, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు స్వాధీనం

నందలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): టంగుటూరు సమీపంలోని చెయ్యేరులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఎక్స్‌కవేటర్లు, 5 ట్రాక్టర్లను మంగళవారం పెనగలూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసి ఉన్నతాధికారుల సూచన మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు. స్వాధీనం చేసుకున్న వాటిని నందలూరు పోలీసుస్టేషన్‌లో అప్పగించారు.

సిద్దవరంలో 150 మామిడి మొక్కల నరికివేత



నరికేసిన మామిడి మొక్కలు

పెనగలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో రెండేళ్ల వయసున్న 150 మామిడి మొక్కలను సోమవారం ఉదయం నరికివేసినట్లు ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. తిరుమల రాజంపేట హరిజనవాడ వాసి రామాంజనమ్మ ఐదెకరాల్లో రెండేళ్ల కిందట మామిడి మొక్కలు నాటి సంరక్షించుకుంటోంది. అదే గ్రామానికి చెందిన పూలతోట హరి వాటిని నరికివేశాడంటూ లేబాక శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పడకేసిన వైద్యం



చిన్నఓరంపాడులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహిస్తున్న శిథిల భవనం

- ప్రైవేటును ఆశ్రయిస్తున్న జనం
- పారిశుధ్యం నిర్వహణలో నిర్లక్ష్యం
- పని వేళలు పాటించని వైద్యులు
- పలు ఆస్పత్రుల్లో మౌలిక వసతులూ కరువే..

సంబేపల్లె/రాయచోటిటౌన్/చిన్నమండెం/సుండుపల్లె/రామాపురం/లక్కిరెడ్డిపల్లె/ రాజంపేట/రైల్వేకోడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఏరియా ఆసుపత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పలువురు వైద్యులు పని వేళలు పాటించడం లేదు. ఆస్పత్రుల్లో తాగునీరు, మౌలిక వసతులు కరువయ్యాయి. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒకరిద్దరు వైద్యులు మినహా మిగిలినవారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు ప్రైవేటు ప్రాక్టీసు చేస్తూ, బాధ్యతలపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతి విజిట్‌లో పలు విషయాలు వెలుగు చూశాయి.

ప్రైవేటు సేవలో

వంద పడకలున్న రాజంపేట ఏరియా ఆసుపత్రిలో ఆశించిన స్థాయిలో వైద్యం అందడంలేదు. రోజూ 200 మందికి పైగానే రోగులు ఈ ఆసుపత్రిని సందర్శిస్తారు. ఈ ఆసుపత్రి సూపరింటెండెం ట్ ఆళ్లగడ్డలో సొంత ఆసుపత్రి నిర్వహిస్తూ, వారానికి ఒకటి రెండు రోజులు మాత్రమే విధులకు హాజరయ్యే ఆయన, మంగళవారం మాత్రం ఆసుపత్రికి వచ్చారు. ఇక్కడ కంటివైద్యులు లేకపోవడంతో సేవలు నిలచిపోయాయి. పారిశుధ్యం నిర్వహణలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది



రాజంపేట ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చిన రోగులు

కోడూరులో..

నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉన్నా మందుల కొరత ఎక్కువగా ఉంది. సర్జన్ లేక పోవడంతో అత్యవసర చికిత్స అవసరమైతే తిరుపతికి వెళ్లాల్సివస్తోంది. ఇన్సులిన్ కొరత ఎక్కువగా ఉంది

మండల కేంద్రాల్లో వైద్యం కరువు

ఓబులవారిపల్లె మండలంలోని చిన్నఓరంపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శిథిల భవనంలో నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలోని ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులు అవసరం కాగా, ఒకరు మాత్రమే ఉండడంతో సక్రమంగా వైద్యం అందడంలేదు.పుల్లంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 63 రకాల వ్యాధులకు 172 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని వైద్యులు డాక్టర్ సాని శేఖర్ తెలిపారు. ఒంటిమిట్ట ఆరోగ్య కేంద్రంలో జ్వరపీడితులు ఎక్కువగా ఉన్నారు. వాటర్ ప్యూరిఫయర్ నిరుపయోగంగా మారడంతో తాగునీటి సమస్యతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. 9 గంటలకే ఓపీ ప్రారంభమైనా అందుకు తగ్గ వైద్యసేవలు అందడంలేదు. సుండుపల్లె మండల కేంద్రంలో బోరు పాడవడంతో తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది. సిద్దవటంలోని ఆరు పడకల ఆసుపత్రి పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. పెనగలూరు ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లు పనిచేస్తుండగా ఒక డాక్టర్ సెలవుపై వెళ్లారు. ఓబులవారిపల్లె డాక్టర్‌ను డెప్యుటేషన్‌పై నియమించగా ఆ డాక్టర్ 10.30 గంటలకు వచ్చారు.



ఓబులవారిపల్లె: వైద్యులు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

రాయచోటి నియోజకవర్గంలో..

ఏరియా ఆసుపత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు సమయపాలన పాటించడం లేదు. ఆస్పత్రుల్లో తాగునీరు మౌలిక వసతులకు నోచుకోక రోగులు అవస్థలు పడుతున్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతి బృందం ఆరోగ్య కేంద్రాలపై పరిశీలించగా... రాయచోటి ఏరియా ఆసుపత్రిలో మంగళవారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకు వైద్యులు విధులకు వస్తూనే ఉన్నారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలకు చెందిన 22 మంది వైద్యులు పనిచేస్తున్నారు. పీపీ యూనిట్ వైద్యులు 10 గంటలకు కూడా విధులకు రాలేదు. సీటీ స్కాన్ లేకపోవడంతో ఆ గది మూతపడింది. ఇక్కడ ఉన్న ఆప్తాల్మిక్ అసిస్టెంట్ డెప్యుటేషన్‌పై వెళ్లడంతో కంటి రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఫార్మసిస్టు డెప్యుటేషన్‌పై వెళ్లడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పీడియాట్రిక్ వైద్యులు సమయానికి రాక పోవడంతో చిన్నపిల్లలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆసుపత్రి భవనం పనులు పూర్తి కాలేదు. ఆక్సిజన్ , నీటి సమస్య వెంటాడుతున్నాయి. ఈ ఆసుపత్రిలో రోజుకు 800 నుంచి 900 వర కు ఓపీ జరుగుతుండగా రాష్ట్రంలోని 54 ఏరియా ఆసుపత్రుల్లో రాయచోటి ఏరియా ఆసుపత్రి ఏ గ్రేడ్‌లో ఉంది. ప్రహరీ గోడ ఇంకా పూర్తి కాలేదు. ఆసుపత్రిలో 70 శాతం పనులు పూర్తయ్యాయి. ఇంకా 30 శాతం పనులు జరుగుతూనే ఉన్నాయి. సంబేపల్లె మండలంలో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు 9 గంటలకు విధులకు వచ్చారు. సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒకరు సెలవుపై వెళ్లగా, ఒకరు విధులకు హాజరయ్యారు. చిన్నమండెం ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉండగా ఒకరు లీవ్‌లో ఉన్నారు. సుండుపల్లె ఆరోగ్య కేంద్రంలో బోరు మోటారు చెడిపోవడంతో తాగునీటి సమస్య నెల కొంది. లక్కిరెడ్డిపల్లె మండలంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 30 పడకల ఆసుపత్రిలో నీటి సమస్య ఉంది. దీంతో సీసాల్లో నీళ్ల తెచ్చుకుంటున్నామని రోగులు తెలిపారు. రామాపురం వైద్యశాలలో. ప్రతి రోజు 70 నుంచి 80 మంది ఓపీ ఉండగా, వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.

ప్రజావాణి సమస్యలపై సబ్‌కలెక్టర్ ఆరా



సబ్‌కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

పెనగలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు, సబ్ కలెక్టర్‌కు ఇచ్చిన అర్జీలపై మంగళవారం రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి ఆరా తీశారు. మంగళవారం పెన గలూరు రెవెన్యూ కార్యాలయానికి చేరుకున్న ఆమె వీఆర్వోలతో సమావేశమయ్యారు. పెండింగు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు, సభ్యులకు ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై ఆరా తీశారు. ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దారు సీహెచ్ ఇంద్రాణి, డిప్యూటీ తహసీల్దారు జ్యోతి తదితరులు ఉన్నారు.

సులభమైన పద్ధతిలో బోధించాలి

నందలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్క ఉపాధ్యాయుడు విద్యార్థి స్థాయికి తగ్గట్లు బోధించాలని నందలూరు హైస్కూల్ ఇన్‌చార్జి హెడ్మాస్టర్ షేక్ రౌఫ్‌బాషా కోరారు. మంగళవారం స్థానిక హైస్కూల్లో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్సు సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు వృత్తి ధర్మాన్ని నెరవేరుస్తున్నారని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలలో ఆచరించాలని కృత్యాధార పద్ధతిలో విషయ పరిజ్ఞానాన్ని అందించాలని బోధన ఉపకరణాలు, డిజిటల్ క్లాస్ వినియోగించాలని కోరారు.

క్రీడా పోటీల్లో గురుకుల పాఠశాల ప్రతిభ

ఓబులవారిపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గండిలో జరిగిన రాయలసీమ స్థాయి ఆటల పోటీల్లో సంజీవపురం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరచినట్లు ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. ఖోఖో, క్యారమ్స్‌లో మొదటి బహుమతి, చెస్‌లో రెండో బహుమతి, 100 మీటర్ల రన్నింగ్ పోటీల్లో మొదటి బహుమతి, 1500, 800 మీటర్ల పోటీల్లో మూడో బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మన్సూర్‌అలీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిజికల్ డైరెక్టర్ విజయానందమూర్తి, పీఈటీ సురేంద్ర ఆధ్వర్యంలో తమ విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచినట్లు ఆనందంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పులి రామకృష్ణ, డి.రామకృష్ణ, లోకానందరెడ్డి తదితర ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

రాయచోటిటౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చిన్నప్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెల 4వ శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తొగటవీర క్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోడెం వీరాంజనేయప్రసాద్ తెలిపారు. స్థానిక మదనపల్లి రోడ్డులోని బీజేపీ కార్యాలయంలో తొలి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హీరో, మోటో కార్ప్, డైకిన్, వింగ్ టెక్, నియోలినిక్, ఇన్ఫిలూమ్ వంటి ఐదు కంపెనీల ద్వారా నెలకు రూ.14 వేల నుంచి రూ.21వేల జీతంతో శ్రీసిటి, రేణిగుంట, మాంబట్టులలో అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆయన తెలియజేశారు.పది, ఇంటర్, డిగ్రీ చదివిన 32 సంవత్సరాలలోపు పురుషులు, 34 ఏళ్లలోపు స్త్రీలు, ఐటీఐ చదివిన 27 సంవత్సరాలలోపు స్త్రీ, పురుష అభ్యర్థులకు ఈ నెల 22వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 9652285027 నెంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.బీజేపీ రాయచోటి అసెంబ్లీ కన్వీనర్ నిర్మల్‌కుమార్, ఓబీసీ మోర్చా జనరల్ సెక్రటరీ వెంకట్రమణగౌడ్, బీజేపీ జనరల్ సెక్రటరీ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు సీఐ కౌన్సిలింగ్

రాయచోటిటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం ట్రాఫిక్ సీఐ విశ్వనాథ్‌రెడ్డి వాహనాల తనిఖీలు నిర్వహించారు. పట్టుబడిన మైనర్ల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనాల కారణంగా మైనర్లు ప్రమాదాల బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, తల్లిదండ్రులు మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వరాదని హెచ్చరించారు.

కుంటలు, చెరువులను ఆక్రమిస్తే కఠిన చర్యలు

రామాపురం, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): ఉన్న చెరువులు, కుంటలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రామాంజనేయులు హెచ్చరించారు. హసనాపురం పంచాయతీ చింతలవాండ్లపల్లె సమీపంలో ఉన్నకుంటను కొందరు వ్యక్తులు ఆక్రమించడంతో మంగళవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్‌వో, సిబ్బంది వెళ్లి ఆక్రమణలు తొలగించారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామన్నారు.

ఉద్యోగాల నుంచి తొలగిస్తే ఆందోళన

ఓబులవారిపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానికులను ఉద్యోగాల నుంచి తొలగిస్తే ఏపీఎండీసీ కార్పొరేషన్‌కు పుట్టగతులు ఉండవని బీకేఎంయూ నాయకుడు పండుగోల మణి హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీఎండీసీ అభివృద్ధిలో స్థానికులు తమ సర్వస్వం త్యాగం చేసి, సంస్థలో చిరుద్యోగం చేస్తూ దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. ఆ ఉద్యోగాలను కూడా తొలగించాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. తక్షణం నిర్వాసితులందరికీ ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేస్తామన్నారు.

ఫారెస్ట్ అధికారుల వేధింపులు ఆపాలి

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఫారెస్టు అధికారుల వేధింపుల నుంచి దళితుడు పెద్ద గంగయ్యకు రక్షణ కల్పించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ డీఆర్‌వో మధుసూదన రావుకు ఫిర్యాదు చేశారు. కేశాపురం దళితవాడకు చెందిన పెద్దగంగయ్య ఫారెస్టుకు సమీపంలో ఉన్న రెండున్నర ఎకరాల భూమిని 30 ఏళ్లుగా సాగుచేసుకుంటున్నాడని, ఈ విషయంలో ఫారెస్టు గార్డు రత్నమ్మ ఆయనను రెండేళ్లుగా బెదిరించడంతోపాటు, పైరును అక్రమంగా దున్నేసి నష్టపరుస్తుండడంతో 2023 డిసెంబర్‌లో మూడు రోజుల పాటు కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేశామన్నారు. ఈ విషయంపై విచారణ చేసిన కలెక్టర్ గిరీషా పెద్ద గంగయ్య సాగు చేస్తున్న భూమితో పాటు మలసాని రాధమ్మ, వసంత ఆక్రమణలో ఉన్న 10 ఎకరాల మామిడితోట కూడా ఫారెస్టు పరిధిలోకి వస్తుందని నిర్ధారించారన్నారు. గంగయ్య భూమితోపాటు అగ్రవర్ణ మహిళలు మలసాని రాధమ్మ, వసంతల ఆక్రమణ ఆధీనంలో ఉన్న 10 ఎకరాల మామిడి తోటను కూడా స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ చిన్నమండెం మండలశాఖ అధ్యక్షులు పందరయ్య, బాధిత దళితుడు గంగయ్య పాల్గొన్నారు.

పోస్టాఫీసులో ప్రీమియం ఖాతా ప్రారంభించండి

రామాపురం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఏ బ్యాంక్‌లో అకౌంట్ లేని వారు రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీలు పొందాలంటే పోస్టాఫీసులో ఐపీపీబీ ప్రీమియం అకౌంట్ ఓపెన్ చేయించుకోవాలని కడప సౌత్ సబ్ డివిజన్ (పోస్టల్) ఇన్‌స్పెక్టర్ నల్లబల్లె సుబ్బరాయుడు తెలియజేశారు. రామాపురం పోస్టాఫీసు పరిధిలోని అన్ని గ్రామాల వారు తమకు సమీపంలోని లేదా రామాపురం పోస్టాఫీసులో కొత్త అకౌంట్ లేదా ఆధార్ లింక్ చేయించుకోవాలన్నారు. ఈ డ్రైవ్ ఈ నెలాఖరు వరకు కొనసాగునని తెలియజేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చర్యలు ప్రారంభించాలి

రాయచోటిటౌన్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వెంటనే చర్యలు ప్రారంభించాలని ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యమాదిగ కోరారు. రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ నియమించడంపై ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డప్పు, చర్మ కళాకారుల రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం మాదిగ, ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు చెంచర్ల ఆంజనేయులు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి చెన్నకేశవాలయ బ్రహ్మోత్సవాలు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవళంపల్లెలో ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెన్నకేశవ స్వామి ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. 20న గణపతి పూజతో మొదలై 24న కల్యాణంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు ప్రతి రోజు స్వామికి అమ్మవార్లకు ఘనంగా పూజలు నిర్వహిస్తారని వారు వివరించారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ ఆపై కోర్సులు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం జ్ఞాన భూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉన్నట్లు వివరించారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ఓబులవారిపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల గ్రంథాలయం ఆధ్వర్యంలో హైస్కూల్ ఆవరణలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు లైబ్రేరియన్ అష్రఫ్ అలీ తెలిపారు. ఈ పోటీల్లో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యాలు పెంపొందింపజేయాలని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి డా క్టర్ సుబ్రమణ్యం సూచించారు. మంగళవారం మండలంలోని ఏపీ మోడల్ స్కూల్, ఎంఆర్ కార్యాలయాలను ఆయన పరిశీలించారు. అపార్ ఐడీ నమోదు కార్యక్రమం ఎంతశాతం పూర్తయిందని ఎంఈవో వెంకట సుబ్బయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏపీ మోడల్ స్కూల్ సందర్శించారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన సిలబస్, ఎఫ్ ఏ 1, ఎఫ్ ఏ2 పరీక్షల వివరాలు తెలుసుకున్నారు. పబ్లిక్ పరీక్షలు ఎదుర్కోడానికి 10వ తరగతి విద్యార్థులు సిద్ధంగా ఉండాలని సూచించారు. మంచి ఫలితాలు సాధించినపుడే మంచి భవిష్యత్ ఉంటుందని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పది, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకోసం ఉదయం సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలన్నారు. ఎంఈఓ 2 వెంకట సుబ్బయ్య, ప్రిన్సిపాల్ కోమటి రెడ్డి శివశంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రామాపురం: ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

రామాపురం: కొండావాండ్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన డీఈవో బోధన విధానాలను పరిశీలించారు. పాఠశాలల్లోని విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణుడు, జెడ్పీహెచ్ఎస్ కొండావాండ్లపల్లె ప్రధానోపాధ్యాయురాలు జీవి సుధారాణి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో జీవితం ఆనందమయం

● టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకుంటే వారికి పలు లాభాలు చేకూరుతాయని, వారి జీవితం బాగుపడుతుందని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. రాజంపేట పట్టణం సాయినగర్, వరదయ్యగారిపల్లెలో మంగళవారం నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకుంటే, కోటిమంది సభ్యులున్న కుటుంబంలో చేరుతారన్నారు. నియోజకవర్గం 60 వేల సభ్యత్వాలు పూర్తి చేసుకుని రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిందన్నారు. లక్ష సభ్యత్వాలను పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సాయినగర్‌లో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆ ప్రాంత టీడీపీ నాయకులు నీలి చెంగారావు, నీలి ఈశ్వరయ్య, శేఖర్, సుంకర సుధాకర్, జయరామిరెడ్డి, సుబ్రమణ్యం, వరదయ్యగారిపల్లెలో సతీష్‌నాయుడు, కేసీ నాయుడు, హరినాయుడు పాల్గొన్నారు. ఎంపీటీసీ సభ్యుడు నాగార్జుననాయుడు ఆధ్వర్యంలో పార్టీ చేరిన వారిని సుగవాసి బాలసుబ్రమణ్యం టీడీపీ కండువాలు వేసి ఆహ్వానించారు.

ఆర్యవైశ్య నేతకు పరామర్శ

పట్టణంలోని ఆర్యవైశ్య సంఘ నాయకులు గ్రంధి నాగసత్యనారాయణను సుగవాసి పరామర్శించారు. ఆయన శ్రీమతి లక్ష్మీకుమారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.టీడీపీ పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, మండల టీడీపీ సీనియర్ నాయకులు నాగేశ్వర నాయుడు, గంప శివ, కొండా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం

మార్కెట్ యార్డును అభివృద్ధి చేయాలి

రాయచోటిటౌన్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున ఉన్న మార్కెట్ యార్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన రైతు సంఘం నేతలతో కలిసి మార్కెట్ యార్డును పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రహరీ గోడ లేకపోవడంతో మార్కెట్‌యార్డు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా తయారైందన్నారు. యార్డును పశువుల సంతగా మాత్రమే ఉపయోగించడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం రాకపోవడమే గాక, లక్షలాది రూపాయలతో నిర్మించిన శీతల గిడ్డంగులు నిరుపయోగంగా మారాయన్నారు. అల్లరి మూకల కారణంగా ఈవీఎం గోడౌన్‌కు రక్షణ లేకుండా పోవడంతో పాటు వ్యవసాయ ల్యాబ్‌లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు భయపడుతున్నారన్నారు. కొత్తపేటలోని రైతు బజారును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చి రైతులు, ప్రజలకు బాసటగా నిలవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగబసిరెడ్డి, రామాంజులు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవాను 'వెలిగల్లు'తో అనుసంధానించాలి

గాలివీడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా ప్రాజెక్టును వెలిగల్లు జలాశయంతో అనుసంధానం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గాలివీడులో కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వెలిగల్లు ప్రాజెక్టు అడుగంటిపోకుండా ఉండేందుకు ఈ చర్య అవసరమన్నారు. కుడికాలువకు పరిధిలోని పిల్ల కాలువల పనులు పూర్తి చేసి గాలివీడు, చిన్నమండెం, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, రాయచోటి, సంబేపల్లె మండలాల్లోని చెరువులను నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు వెంకట్రామిరెడ్డి, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

చేనేతల సమస్యలు పరిష్కరించాలి

సిద్దవటం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాజంపేట నియోజకవర్గ జనసేనపార్టీ నాయకుడు అతికారి కృష్ణ మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర చేనేత వికాస విభాగం చైర్మన్, మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావును కోరారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ పట్టు ధరలు పెరగడంతో చేనేత కార్మికుల పరిస్థితి అధ్వానంగా మారిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణంలో పచ్చని చెట్ల తొలగింపు



పచ్చని చెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

రాజంపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటి పరిరక్షించాల్సిన తరుణంలో పట్టణంలో ఏళ్ల తరబడి ఉన్న వృక్షాలను కూడా మంగళవారం కూల్చివేశారు. పట్టణంలోని మురుగు కాలువల మరమ్మతు పనులను స్థానిక మున్సిపాలిటీ అధికారులు కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఆ పనులు చేసేందుకు అడ్డుగా ఉన్నాయంటూ కాంట్రాక్టరు మంగళవారం ఎక్స్‌కవేటర్ల సాయంతో పలు ప్రాంతాల్లో ఉన్న వృక్షాలను తొలగించారు.అప్పజెప్పడంతో ఆ కాంట్రాక్టర్ జేసీబీలతో అక్కడున్న చెట్లను పెకిలించి తీసివేస్తున్నారు. కాలువల్లో పూడికలు తీసివేసి, మట్టిని రోడ్లపై వేసి ఇబ్బందులు పెడుతున్నారు. గతంలో మున్సిపల్ అధికారులు పెంచిన చెట్లను తొలగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై ఆంధ్రజ్యోతి మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరడంతో వెంటనే చెట్లను తొలగించే కార్యక్రమాన్ని విరమించుకున్నారు.

విద్యార్థుల నాటకం కనువిప్పు కావాలి

సంబేపల్లె, నవంబరు19(ఆంధ్రజ్యోతి): వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంబేపల్లె జడ్పీ హైస్కూలు విద్యార్థులు మంగళవారం ప్రదర్శించిన నాటకం కనువిప్పు కావాలని ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం ప్రార్థన సమయంలో ఉపాధ్యాయురాలు రావూరి సుజాత ఆధ్వర్యంలో విద్యార్థులు వృద్ధులతో ఆప్యాయత చూపాలని నాటకం ద్వారా తెలియజేశారు. ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నామని...

● భవన నిర్మాణ కార్మికులకు అండగా... ● 400 మంది కార్మికులకు ఆర్థికసాయం
● విద్య, ఆధునిక మెలకువలపై శిక్షణ ● ఆదర్శం బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్

పీలేరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ 2008లో పీలేరులో నలుగురు తాపీ మేస్త్రీలతో పురుడు పోసుకుంది. భవన నిర్మాణ రంగంలో నిరక్షరాస్యులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు ఎక్కువగా ఉండడం, అవగాహన లేమి కారణంగా శ్రమ దోపిడీకి గురవుతుండడంతో అప్పట్లో పీలేరులో పేరెన్నిక కలిగిన పలువురు తాపీ మేస్త్రీలు బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్‌ను ప్రారంభించారు. గృహ యజమానులకు, మేస్త్రీలు, కూలీలకు మధ్య ఏర్పడే తగాదాలను పరిష్కరించే వేదికగా ప్రారంభమైనప్పటికీ తదనంతర కాలంలో సామాజిక సేవా కార్యక్రమాల వారధిగా నిలిచింది. అసోసియేషన్‌లోని ఓ సభ్యుడి మదిలో మెదిలిన ఆలోచన దాదాపు 37 విభాగాల కార్మికులను సమన్వయం చేసుకుని, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 12 మండలాలకు విస్తరించి నేడు 3 వేల మంది కార్మికులకు సేవలందిస్తోంది.

400 మందికి ఆర్థిక సాయం

ఆవిర్భావం నుంచి నేటి వరకు పీలేరు బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ దాదాపు 400 మందికి ఆర్థిక సాయం అందించింది. నిర్మాణ రంగం అంటేనే ప్రమాదాలమయం. ఎటువంటి రక్షణ కవచాలు, జాగ్రత్తలు లేకుండా చాలా మంది కార్మికులు దేవుడిపై భారం వేసి జీవనాధారం కోసం పనిచేస్తుంటారు. చిన్న చిన్న అజాగ్రత్తలతో పాటు అప్పుడప్పుడు మితిమీరిన ఆత్మవిశ్వాసం, నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. ఆ ప్రమాదాల్లో కార్మికులు ప్రాణాలు కోల్పోవడం, తీవ్ర గాయాల పాలవడం, కొన్నిసార్లు అంగవైకల్యం పొందడం జరుగుతూ ఉంటుంది. అటువంటి సందర్భాల్లో వారు పనిచేస్తున్న ప్రదేశాల్లోని యజమానులు జాలిపడో, బాధ్యతగానో అందించే అరకొర సాయం, వారు పనిచేస్తున్న మేస్త్రీ అందించే సాయమే వారికి దిక్కే పరిహారం. అలా దిక్కే పరిహారంతో ఆయా కుటుంబాలు ఇబ్బందులు పడడం అసోసియేషన్ నాయకుడైన బలరాం గమనించి తమలోని సహచరుడికి ఇబ్బంది కలిగినప్పుడు ఇతరుల మీద ఆధారపడడం కంటే తామే ఎందుకు ఆదుకోకూడదని ఆలోచించి కార్మికులందరినీ ఏకతాటిపైకి తెచ్చి ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తలో చేయి వేసి సహచరులకు సాయం అందించాలని, ఆ సాయం ఒక్కసారికే పరిమితం కాకుండా వారికి అవసరమైనప్పుడల్లా ఆదుకోవాలని అందరినీ చైతన్యపరిచాడు. అలా బహుజన అసోసియేషన్‌లోని సభ్యులకు ఆర్థిక సాయం అందే ప్రక్రియ ప్రారంభమైంది. పీలేరు పరిధిలోని పీలేరు, కేవీపల్లె, కలికిరి, గుర్రంకొండ, ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు, రొంపిచెర్ల, పులిచెర్ల, సదుం, సోమల, ఐరాల, పూతలపట్టు మండలాల్లో ఏదైనా ప్రమాదం జరిగినట్లు తెలిసిన వెంటనే అసోసియేషన్ సభ్యులు అక్కడకు వెళ్లి తక్షణ సాయంగా రూ.వేయి అందిస్తారు. సంఘటనా స్థలం నుంచి ఆయా కార్మికుల స్వస్థలాలకు తీసుకెళ్లేందుకు అవసరమైన రవాణా సదుపాయం ఏర్పాటు చేస్తారు. ఆ తరువాత ప్రమాదం గురించి తమ అసోసియేషన్ గ్రూపులో పోస్టు చేసి సాయం చేయాల్సిందిగా అర్థిస్తారు. గ్రూపులోని సభ్యులు తమకు తోచిన సాయాన్ని అసోసియేషన్ నాయకులకు ఫోన్ పేగానీ నగదుగానీ అందజేస్తారు. వారం రోజుల పాటు అందరి దగ్గర వసూలు చేసి ఆయా బాధిత కార్మికులు లేదా వారి కుటుంబసభ్యులకు అందజేస్తారు. ప్రమాద తీవ్రతను బట్టి రూ.5 వేల నుంచి రూ.లక్ష దాకా వసూలు చేస్తుంటారు. అలా ఇప్పటి వరకు సుమారు 400 మందికి రూ.5 వేల నుంచి రూ.లక్ష దాకా సాయం అందించినట్లు బలరాం తెలిపారు. సగటున నెలకు రెండు కేసులు తమ దృష్టికి వస్తుంటాయని, ఎటువంటి విసుగు లేకుండా తమ అసోసియేషన్ సభ్యులు స్పందించి తగిన ఆర్థిక సాయం అందజేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా సమయంలో ఎక్కువగా ఇబ్బంది పడింది భవన నిర్మాణ రంగ కూలీలే. ఆ సమయంలోనూ తమ అసోసియేషన్ ద్వారా వందలాది మంది కార్మికులకు నిత్యావసర సరుకులు అందించి వారిని ఆకలి బాధల నుంచి తప్పించారు.


మేస్త్రీ కరీముల్లా కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

అవగాహన సదస్సుల నిర్వహణ

బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేవలం ఆర్థిక సాయం చేయడమే కాకుండా నిర్మాణ రంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న ఆధునిక పద్ధతులు, వాటిని అందిపుచ్చుకునే వైనాన్ని కార్మికులకు వివరిస్తున్నారు. పలు సంస్థలు, తిరుపతి, హైదరాబాదు వంటి నగరాల్లో ఉన్న టెక్నీషియన్లను పిలిపించి తమ సభ్యులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా వృత్తిలో మెలకువలు నేర్పిస్తున్నారు. అంతేకాకుండా పనిప్రదేశాల్లో వాడాల్సిన రక్షణ పనిముట్ల గురించి తెలియజేసి స్వంతంగా గానీ లేక దాతల సాయంతో వాటిని సమకూర్చుకుని కార్మికులకు అందజేస్తున్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వం నుంచి లభించే ప్రయోజనాలను ఎప్పటికప్పుడు వివరిస్తూ తమతో కలిసి వచ్చే కార్మికులందరినీ కార్మిక శాఖ వద్ద నమోదు చేయించి వారికి ఆయా ప్రయోజనాలను అందేలా చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా కార్మికులకు విద్య ప్రాధాన్యత వివరిస్తూ వారి పిల్లలు చదువుకునేలా చూడడమే కాకుండా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారి పిల్లలకు వివిధ పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడి ఫీజులు కూడా తగ్గిస్తున్నారు.

చట్టాలు, పథకాలపై అవగాహన



భవన నిర్మాణ రంగంలోని కార్మికులు ప్రభుత్వ చట్టాలు, పథకాలపై అవగాహన పెంచుకోవాలి. అసంఘటిత రంగంలోని భవన నిర్మాణ రంగం కూలీల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నా నిరక్షరాస్యత కారణంగా వాటిని కార్మికులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఒళ్లు హూనం చేసుకుని కష్టపడే కార్మికులు ఇతరుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడకూడదన్నది నా అభిమతం. అందుకనే ప్రమాదాల కారణంగా ఇబ్బందిపడే కార్మికులకు ఏదైనా చేయాలన్న ఆలోచనతో ఆర్థిక సాయం వితరణ ప్రారంభించాం. నా ఆలోచనను మెచ్చుకుని తోటి సభ్యులు ఇప్పటి వరకు తమకు తోచిన సాయం అందిస్తున్నారు. భవిష్యత్తులో కూడా దీనిని కొనసాగిస్తాం.

-బలరాం, అధ్యక్షుడు, పీలేరు బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్


కరోనా సమయంలో కార్మికులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం (ఫైల్)


పని ప్రదేశంలో ధరించాల్సిన హెల్మెట్లపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అసోసియేషన్ నాయకులు, సభ్యులు (ఫైల్)

ఆనందంగా ఉంది



నిర్మాణ రంగంలో బాగా సంపాదించిన వాళ్లు చాలా తక్కువ. అధిక శాతం మంది కార్మికులే. ఏ పూటకాపూట కడుపు నింపుకునే వారు ఎక్కువ. ప్రమాదాలు జరిగినప్పుడు వారు ఇబ్బంది పడుతూ ఉంటారు. మా అధ్యక్షుడి ఆలోచన కారణంగా అటువంటి వారికి అంతో ఇంతో సాయం చేసే అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉంది. వారికి అండగా ఉన్నామని తెలియజేసేందుకు సాయం అందిస్తున్నాం.

-ప్రభాకర్ రాజు, కార్యదర్శి, పీలేరు బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్

సేవా కార్యక్రమాలు చూసి...



మా సహచరులకు నిరంతరం ఆర్థిక సాయం అందించే సంఘం నాకు ఎక్కడా కనిపించలేదు. ఆ సేవా కార్యక్రమం చూసి నేను స్వచ్ఛందంగా వారితో కలిసి పనిచేస్తున్నా. ప్రమాదం జరిగిందని తెలిసినప్పుడు చిన్న చిన్న వారు సైతం తమకు తోచిన సాయం చేస్తుంటారు. ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అంటారు. ఆ పనిని భవన నిర్మాణ రంగ కార్మికులు నిజం చేసి చూపిస్తున్నారు.

-ఎన్టీఆర్ నఫీస్, పీలేరు బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్

రోడ్డు పనులు నాణ్యతగా చేయాలి

కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించిన కలెక్టర్ చామకూరి శ్రీధర్


కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో మాట్లాడుతున్న గ్రామస్థులు

చిన్నమండెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనులను నాణ్యతగా చేయాలని, నాణ్యతలో రాజీపడవద్దని కలెక్టర్ చామకూరి శ్రీధర్ కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలో పర్యటించిన కలెక్టర్ తొలుత ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. రెవెన్యూలో అసైన్డ్ భూములు, డాటెడ్ ల్యాండ్ భూముల గురించి పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం తూర్పుపల్లి దళితవాడలో 10 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు వేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. అలాగే గొర్లముదివేడు నుంచి తూర్పుపల్లి వరకు కోటి రూపాయలతో వేస్తున్న సీసీ రోడ్లను ఆయన పరిశీలించి నాణ్యతగా రోడ్లు వేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. ఉప్పరపల్లిలో ఓ వ్యక్తి సీసీ రోడ్డును తవ్వేసి అడ్డంగా గోడ నిర్మించి తమకు రహదారి లేకుండా చేశాడని, ఈ విషయం పలుమార్లు అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోలేదని వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రోడ్డును తవ్వేసిన వ్యక్తిపై కేసు పెట్టాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో శేఖర్‌నాయక్‌ను కలెక్టర్ ఆదేశించారు. దేవదాయ భూములు ఆక్రమణకు గురయ్యాయని కలెక్టర్ దృష్టికి తీసుకుపోగా ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుని ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

సిబ్బంది నుంచి రూ.40 వేలు రికవరీ


సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ

పెద్దమండ్యం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన పనులకు సామాజిక బృందం తనిఖీలు నిర్వహించి రూ.40 వేలు రికవరీ చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. పెద్దమండ్యం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం డ్వామా పీడీ వెంకటరత్నం, ఏపీడీలు ప్రతాప్, మధుబాబు, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఏపీవో మురళి, ఎంపీపీ పూర్ణచంద్రిక రమేశ్, కో-ఆప్షన్ సభ్యుడు ఖాదర్‌వలి సమక్షంలో సామాజిక తనిఖీ బృందం బహిరంగ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో జరిగిన పనులకు ఈనెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు సామాజిక బృందం పనులను తనిఖీ చేశారు. ఉపాధి పనుల మస్టర్‌లలో సంతకాలు లేకుండా చెల్లింపు, అదనపు చెల్లింపులు, ఎక్కువ పనిచేసిన వారికి తక్కువ చెల్లింపులతో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఉపాధి సిబ్బంది నుంచి రూ.40 వేలు రికవరీ చేయించాలని తేల్చినట్లు వెల్లడించారు. నలుగురు ఉపాధి సిబ్బందికి రూ.5 వేలు జరిమానా విధించారు. ఉపాధి నిధులతో నాటిన మామిడి తోటల్లో సుమారు రూ.2 లక్షల విలువ చేసే మామిడి చెట్లు ఎండిపోయాయి, ఎండిన మొక్కల స్థానంలో పచ్చని మొక్కలను రైతుల నుంచి నాటించాలని ఉపాధి సిబ్బందిని డ్వామా పీడీ ఆదేశించారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

రాయచోటి టౌన్/ సుండుపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న బుర్రలదిన్నె పాఠశాల ఉపాధ్యాయుడు నాగముని నాయక్‌ను సస్పెండ్ చేస్తూ డీఈవో కె.సుబ్రమణ్యం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. టి.సుండుపల్లె మండలం బుర్రలదిన్నె పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న నాగముని నాయక్ విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడంటూ ఫిర్యాదులు అందడంతో విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక సమర్పించామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయనను సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అడవిపల్లి రిజర్వాయర్‌కు 6-7 నెలల్లో నీరు

● అసెంబ్లీలో మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి

అమరావతి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా సుజల స్రవంతి పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఇటీవలే సమీక్ష సందర్భంగా ఆదేశించారని, ఆ కాలువ చివరి ప్రాజెక్టు అయిన అడవిపల్లి రిజర్వాయర్‌కు ఆరేడు నెలల్లో నీరు వస్తుందని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. మంగళవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి తన నియోజకవర్గంలోని అడవిపల్లి రిజర్వాయర్ గురించి ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు 2019లో ముఖ్యమంత్రిగా దిగిపోయే నాటికి రూ.2,500 కోట్లు ఖర్చు చేసి పూర్తిచేసిన ఈ జలాశయంలోకి కేవలం రూ.280 కోట్లు పెడితే నీరు వస్తుందన్నారు. ఒకచోట పదెకరాలు, మరోచోట ఆరెకరాలు భూసేకరణ పెండింగ్ వల్ల హంద్రీ-నీవా కాలువ పనులు సాగడం లేదని గత ఐదేళ్ల 82 వేల ఎకరాలకు సాగునీరు అందకుండా పోయిందని వాపోయారు. ఇదే సమయంలో రాష్ట్రంలో ఎక్కడికక్కడ సాగునీటి కాలువలకు మరమ్మతులు చేయలేదని పలువురు ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. నిమ్మల స్పందిస్తూ అడవిపల్లి రిజర్వాయర్‌కు ఆరేడు నెలల్లో నీరు వస్తుందన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి ఊళ్లకు ఊళ్లను ముంచేస్తే జగన్ సర్కారు పట్టించుకోలేదని మండిపడ్డారు. గత ఐదేళ్లలో సాగునీటి రంగం పూర్తి నిర్లక్ష్యానికి గురైందని.. దీనికి మరమ్మతు చేసేందుకు సీఎం చంద్రబాబు ప్రణాళికాబద్ధంగా శ్రమిస్తున్నారని తెలిపారు. కరువు ప్రాంత భూములకూ నీరిస్తామని స్పష్టం చేశారు.

పంట మార్పిడితో మంచి దిగుబడులు


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్

ములకలచెరువు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పంట మార్పిడి పద్ధతితో మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయశాఖాధికారి చంద్రానాయక్ తెలిపారు. మండలంలోని బురకాయలకోటలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట సాగు చేసిన రైతులు తరువాత పంట మార్పిడి చేసి మొక్కజొన్న పంట సాగు చేస్తే పెట్టుబడి ఖర్చులతో పాటు ఎక్కువ ఆదాయం పొందచ్చన్నారు. రబీలో వరి, వేరుశనగ పంట సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా డిసెంబరు 15వ తేదీ లోగా పంటల బీమాను చేయించుకోవాలన్నారు.

అనంతరం పంటల సాగుపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏవో రమేష్‌రాజు, మండల వ్యవసాయాధికారి లీలాకుమారి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మల్లయ్యకొండ కోనేరు వెలవెల...

● నీటి తొట్టి వద్ద స్నానమాచరించి దర్శనానికి వెళుతున్న భక్తులు ● పట్టించుకోని దేవదాయశాఖ అధికారులు

తంబళ్లపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తంబళ్లపల్లె సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ జిల్లాలోనే పురాతన శైవక్షేత్రాల్లో ప్రసిద్ధి గాంచింది. కార్తీక మాసంలో మల్లయ్యకొండకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. తలనీలాలు సమర్పించిన వారు, భక్తులు, మాలదారులు కొండపైన ఉన్న కోనేరులో స్నానమాచరించి అనంతరం స్వామి వారిని దర్శించుకుంటారు. అయితే, కొన్నిరోజుల ముందు కోనేరులోని నీరు దుర్గంధంగా మారి అపరిశుభ్రంగా ఉండటంతో దేవదాయశాఖ సిబ్బంది శుభ్రపరచారు. అప్పటి నుంచి కోనేరుకు నీరు పట్టకపోవడంతో భక్తులు సమీపంలో ఉన్న నీటి తొట్టెలో స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తలనీలాలు సమర్పించిన వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. కోనేరులో నీరు లేకపోవడంతో నీటి తొట్టెలోని నీటితోనే స్నానం చేయాల్సి వస్తోంది. పలువురు భక్తులు కోనేరులో ఉన్న అరకొర నీటిలోనే శివ..శివ.. అంటూ తల తడుపుకుని స్వామిని దర్శించుకుంటున్నట్లు వాపోతున్నారు. ప్రతి ఏటా భక్తులు సమర్పించిన హుండీ కానుకలు, వేలం పాటల ద్వారా మల్లయ్యకొండకు లక్షల్లో ఆదాయం వస్తున్నా భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో దేవదాయశాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని భక్తులు వాపోతున్నారు. వెంటనే కోనేరును నీటితో నింపాలని భక్తులు కోరుతున్నారు.

రోడ్డును కమ్మేసిన పిచ్చిమొక్కలు

మద్దాతంబావి నుంచి మల్లయ్యకొండ పైకి ఉన్న ఘాట్ రోడ్డును పలుచోట్ల పిచ్చిమొక్కలు కమ్మేశాయి. ప్రతి సోమవారం వందల సంఖ్యలో ద్విచక్రవాహనాలు, కార్లు, జీపులు, ట్రాక్టర్లతో పాటు ఆర్టీసీ బస్సులు కొండకు తిరుగుతుంటాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల రోడ్డుకు ఇరువైపులా, మలుపుల వద్ద పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి ఘాట్ రోడ్డు పైకి వచ్చాయి. దీంతో మలుపుల్లో వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాలు చోటుచేసుకోక ముందే మలుపుల వద్ద, రోడ్డు పైకి వచ్చిన పిచ్చిమొక్కలు తొలగించాలని వాహనదారులు, భక్తులు కోరుతున్నారు.

రెండు రోజుల్లో నీటిని నింపుతాం

కోనేరులో పూలు, ఆకులు ఎక్కువగా ఉండటంతో ఇటీవలే సిబ్బంది నీటిని తీసివేసి శుభ్రపరచారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా కోనేరుకు సమీపంలో నీటిని ఏర్పాటు చేశాం. రెండు రోజుల్లో తప్పకుండా కోనేరులో నీటిని నింపుతాము.

- మునిరాజ. ఈవో, మల్లయ్యకొండ, తంబళ్లపల్లె




కోనేరులో ఉన్న అరకొర నీటిలోనే స్నానాలు చేస్తున్న భక్తులు - నీటి తొట్టి వద్ద స్నానమాచరిస్తున్న భక్తులు - మల్లయ్యకొండకు వెళ్లే ఘాట్ రోడ్డు పైకి పెరిగిన పిచ్చిమొక్కలు

దేవాలయ రోడ్డు పనుల పరిశీలన


రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఈఈ సూర్యచంద్రారెడ్డి

రామసముద్రం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలంలోని వాళీశ్వరస్వామి, గట్టు వెంకటేశ్వరస్వామి దేవాలయాలకు వెళ్లే రోడ్డు పనులు జరుగుతుండగా వాటిని చిత్తూరు జిల్లా క్వాలిటీ కంట్రోలర్ ఈఈ సూర్యచంద్రారెడ్డి మంగళవారం పరిశీలించారు. చెంబకూరు మెయిన్ రోడ్డు నుండి గట్టు వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు సుమారు రూ.80లక్షలతో, వాళీశ్వరస్వామి కొండకు వెళ్లే రోడ్డు రూ.2కోట్లతో పనులు జరుగుతుండగా వీటిని ఈఈ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ టూరిజం అభివృద్ధి కార్యక్రమం కింద ఈ ఆలయాలకు రోడ్డు కల్పించడం ద్వారా ఆలయాల అభివృద్ధి జరుగుతుందన్నారు. రోడ్డు పనులలో నాణ్యత లోపం లేకుండా జరుగుతున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి వాళీశ్వరస్వామి ఆలయ రోడ్డు పనులు పూర్తి కావాలని ఈఈ తెలిపారు. ఈకార్యక్రమంలో క్వాలిటీ కంట్రోలర్ డీఈ భాస్కర్, మదనపల్లె పంచాయతీ రాజ్ డీఈఈ శివప్రసాద్, ఏఈ నిరంజన్‌రెడ్డి, కాంట్రాక్టర్ గౌనివారి రెడ్డెప్పరెడ్డి, మాజీ జడ్పీటీసీ కృష్ణంరాజు, స్థానికం రాజేష్, మిట్టపల్లె నాగరాజ పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లరు అరెస్టు
దుంగలు, వాహనం స్వాధీనం


ఎర్రచందనం దుంగలు, వాహనం, నిందితులతో ఎఫ్ఆర్ఓ నయీం అలీ తదితరులు

బద్వేలు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొంగళవీడు సమీపంలో రవాణాకు సిద్ధంగా ఉంచిన వాహనం సహా ఏడు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు ఫారెస్టురేంజ్ ఆఫీసరు కేఎన్ నలీంఅలీ తెలిపారు. డీఎఫ్ఓ వినీత్‌కుమార్, సబ్ డీఎఫ్ఓ స్వామి వివేకానంద ఆదేశాల మేరకు ఎర్రచందనం అక్రమ రవాణా నివారణలో భాగంగా నిర్వహించిన తనిఖీల్లో కొంగళవీడు వద్ద వాహనంలో ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా జరుగుతోందని అందిన సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. దాడుల్లో టాటా ఏసర్, ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని కర్ణాటక రాష్ట్రం కటికనహళ్లికి చెందిన సయ్యద్ ముబారక్‌ను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో శేషయ్య డిప్యూటీ ఫారెస్టురేంజర్, ఎఫ్‌బీఓ సువర్ణకుమార్, రాజేశ్‌రెడ్డి, ఏబీఓ షాజహాన్ పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. పట్టుబడిన దుంగల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని తెలిపారు.

సిమెంట్ రోడ్ల నిర్మాణాలు నాణ్యతగా చేపట్టాలి
● ఏపీఆర్ఆర్‌పీ అడ్వైజర్లు నరసింహారావు, ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏపీఆర్ఆర్‌పీ అడ్వైజర్ ప్రభాకర్‌రెడ్డి

కడప రూరల్, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం (ఎంజీఎన్ ఆర్ ఈ జీ ఎస్) ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే సిమెంట్ రోడ్ల నిర్మాణాలను నాణ్యత, పారదర్శకంగా చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్ ప్రాజెక్టు అడ్వైజర్లు వై.నరసింహారావు, కె. ప్రభాకర్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కడప నగరంలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో సీసీ రోడ్ల నాణ్యతా ప్రమాణాలపై అవగాహన చేపట్టిన వారు మాట్లాడుతూ పల్లెసీమల ప్రగతికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం వరంలాంటిదన్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల రహదారులకు మహర్దశ ఏర్పడుతుందన్నారు. ప్రస్తుత కేంద్ర రాష్ట్రాల పాలనలో వైఎస్ఆర్ జిల్లాలో దాదాపు రూ.75 కోట్ల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రోడ్ల నిర్మాణాలను చేపడుతున్నారన్నారు. ఇందులో సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు ఎక్కువగా ఖర్చు చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి ఎస్టిమేట్ ఎలా ప్రిపేర్ చేయాలి, నేమ్‌ఆఫ్‌ది వర్కు, ఎస్టిమేట్ కాస్ట్, అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ తదితర అంశాలపై పవర్ ప్రజెంటేషన్ ద్వారా ఉమ్మడి కడప జిల్లాలోని డీఈలు, ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు రెండు విడతలుగా శిక్షణను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మంగళవారం పీఆర్ ఎస్ఈ కార్యాలయంలోని సమావేశ హాలులో రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, కమలాపురం, మైదుకూరు, బద్వేల్ నియోజకవర్గాల పరిధి అధికారులకు శిక్షణ ఇచ్చి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను సిమెంటు రోడ్ల నిర్మాణాలు చేపట్టేటప్పుడు పరిగణలోకి తీసుకోవాలన్నారు. రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, కమలాపురం, మైదుకూరు, బద్వేల్ నియోజకవర్గాల పరిధి డీఈలు, ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు 24లోగా దరఖాస్తు చేసుకోండి

కడప మారుతీనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు అర్హత గల జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 24లోగా దరఖాస్తు చేసుకోవాలని కడప బీసీ స్టడీ సంచాలకులు కృష్ణయ్య తెలిపారు. విజయవాడలోని గొల్లపూడి వద్దవున్న బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ కోసం ఈనెల 24లోగా కడప పాత కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు. 27న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ఉత్తీర్ణులకు మెరిట్ ఆధారంగా విజయవాడలో శిక్షణ ఇస్తారన్నారు. బీసీలకు 66శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 14 శాతం రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేసి ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. కావున సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు దరఖాస్తు చేసే అభ్యర్థులు బయోడేటా సహా టెన్త్, ఇంటర్, డిగ్రీ, మార్కులిస్టులు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 1 లక్ష లోపు మాత్రం, వుండాలన్నారు. వీటితో పాటుగా ఆధార్, బ్యాంక్‌పాస్ బుక్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జతపరచి తమ కార్యాలయంలో దరఖాస్తులివ్వాలన్నారు. వివరాలకు 9849919221, 9966418572ను సంప్రదించాలన్నారు.

వారసత్వ సంపదలో దేశంలోనే మేటి కడప



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య జి.సాంబశివారెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వారసత్వసంపద విషయంలో కడప జిల్లా దేశంలోనే మేటిగా నిలుస్తుందని ప్రముఖ చరిత్రకారులు ప్రొఫెసర్ జి.సాంబశివారెడ్డి అన్నారు. మంగళవారం కడప నగరంలోని పాత కలెక్టరేట్ ఆవరణలోని ఇంటాక్ కార్యాలయంలో ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో మన జిల్లాలో ఉన్నన్ని వారసత్వ ప్రదేశాలు, సంపద మరెక్కడాలేవన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనన్నారు. చింతకుంట చిత్రాలను కాపాడుకునేందుకు ఇన్‌టాక్ కోర్టు వరకు వెళ్లి విజయం సాధించిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు పోతుల వెంకట్రామిరెడ్డి, పూర్వకో కన్వీనరు వేణుగోపాల్, సంస్థ పూర్వకన్వీనరు ఎలియాస్‌రెడ్డి, పలువురు ఇన్‌టాక్ సభ్యులు పాల్గొన్నారు.

ఆధార్‌తో ఖాతాల అనుసంధానానికి 30 వరకు గడువు
పోస్టల్ సూపరింటెండెంట్ కిరణ్ వెల్లడి

ప్రొద్దుటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలసొమ్ము ను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి పొందాలంటే ఆధార్‌తో ఖాతాలను అనుసంధానం తప్ప నిసరి అని పోస్టల్ సూపరింటెండెంట్ కిరణ్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడు తూ సుమారు 65 లక్షల మంది లబ్ధిదారులకు ఎన్‌పీసీఐ మ్యాపర్‌లో ఆధార్ సీడింగ్ లేక పోవడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని అన్ని తపాలా కార్యాలయాల్లో ఆధార్‌తో ఖాతాల అనుసంధానప్రక్రియ నవంబరు 30 వరకు చేస్తారన్నా రు. 18 ఏళ్లు నిండి ఖాతాలేని ప్రతి లబ్ధిదారునికీ కొత్త ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ అకౌంట్ ఆధార్ అనుసంధానంతో ఓపెన్ చేయాలన్నారు. ఇందుకోసం కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు ఏర్పాటు ఉంటుందన్నారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రూ.61.36 లక్షల నిధుల దుర్వినియోగం
వైసీపీ మాజీ సర్పంచ్ దేవీప్రసాద్‌రెడ్డిపై కేసు నమోదు

ప్రొద్దుటూరు నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గోపవరం పంచాయతీ వైసీపీ మాజీ సర్పంచ్ కుప్పిరెడ్డి దేవీ ప్రసాద్‌రెడ్డి రూ. 61.36 లక్షల నిధుల దుర్వినియోగంపై క్రిమినల్ కేసు నమోదైనట్లు రూరల్ సీఐ బాలమద్దిలేటి తెలిపారు. వివరాల్లోకెళితే... 2016-17లో గోపవ రం పంచాయతీలో రోడ్లు వేయకున్నా వేసినట్లు అప్పటి సర్పంచ్ దేవీప్రసాద్‌రెడ్డి బిల్లులు చేసుకున్నారు. దీనిపై కొందరు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ జడ్పీ సీఈఓను విచారణ అధికారిగా నియమించారు. ఆవిచారణలో రోడ్లువేయకున్నా వేసినట్లు తప్పుడు బిల్లులు చేసుకున్నట్లు తేలింది. తరువాత వైసీపీ ప్రభుత్వంలో ఆ విచారణ నివేదిక అట కెక్కింది. కొందరు లోకాయుక్తలో కేసు వేయడంతో కొన్ని నెలలుగా విచారణ జరిగింది. నిధుల దుర్వినియోగంపై సదరు బాధ్యులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ నిధులు రికవరీకి లోకాయుక్త ఆదేశించింది. దీంతో లోకాయుక్త ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ తిమ్మక్క రూరల్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తిమ్మక్క ఫిర్యాదుపై మాజీ వైసీపీ సర్పంచ్ కుప్పిరెడ్డి దేవీప్రసాద్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యువకుడిని చితకబాదిన పలువురిపై కేసు నమోదు

బద్వేలుటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీఎస్ఐ చర్చి సమీపంలో మంగళవారం యువకుడిని నలుగురు వ్యక్తులు చితకబాదిన సంఘటన బద్వేలులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు హర్షవర్ధన్ వస్తుండగా బైక్ ఢీ కొనడంతో జాఫర్, నాయబ్, ఓబులేసు, మరొకరు చితకబాదారు. దీంతో హర్షవర్ధన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు.

పేట్రేగుతున్న కబ్జాల పర్వం


మైసూరివారిపల్లె ఏటిపొరంబోకు స్థలంలో నాటిన మామిడి మొక్కలు

రైల్వేకోడూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో కోట్లు విలువైన వంక, ఏటిపొరంబోకు స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయి. ఈ కబ్జాల పర్వం చాలా రోజులుగా సాగుతోంది. చివరకు ఏట్లో ఇసుకనూ వదలడం లేదని స్థానికులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో కబ్జాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. వివరాల్లోకెళితే.... రాఘవరాజపురం పంచాయతీలోని గంగరాజపురం ప్రధానదారిలో కొందరు వ్యక్తులు ఇటీవల రాత్రికి రాత్రే కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కట్టడాలు చేశారు. ఫలితంగా ఇరు రాజకీయ పక్షాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్నాయి. పంచాయతీలోని స్థానికులు, గంగరాజపురంలోని ఆక్రమణదారులకు మధ్య విపరీతంగా గొడవలు జరిగాయి. దీంతో రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడాలను నిలిపి బోర్డు నాటారు. గంగరాజపురం వద్ద ప్రధానదారిలో ఉన్న ప్రభుత్వ వంక పొరంబోకు స్థలం సుమారు రెండెకరాలు ఉంది. ఇది సుమారు రూ. 5కోట్లు విలువ చేస్తుంది. ఈ భూమికి గతంలో సర్వే నెంబరు 38/1 ఉండేది. రీసర్వేలో భాగంగా ఎల్‌పీ నెం. 178గా మారిందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇరిగేషన్‌శాఖ పరిధిలో వంక, ఏటి పొరంబోకు స్థలా లున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణ లున్నాయి. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల మధ్య సమ న్వయం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇద్దరి భాగస్వామ్యంతో కోట్లు విలువైన ప్రభుత్వ వంక, ఏటి పొరంబోకు స్థలాలను కాపడుకోవచ్చని ప్రజ లు అంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో కబ్జాల పర్వం అత్యధికంగా నడిచింది. అదే తంతును కూ టమి ప్రభుత్వం కూడా చేస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. ఏట్లో ఇసుక, రాళ్లు, మట్టి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. లక్షలు విలువైన ఏటి వనరులను దోచుకుంటున్నారు. నియోజ కవర్గంలో వైసీపీ, కూటమి మిలాఖత్ కావడంతో కబ్జాలు ఎక్కువగా సాగుతున్నాయి. ఇదిలా ఉండగా మైసూరివారిపల్లె పంచాయతీకి ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ పెద్దఎత్తున నిధుల వర్షం కురిపించారు. అక్కడ రూ. 60 లక్షలు పెట్టి ఆట స్థలం కోసం పొలాన్ని తీసుకున్నారు. కోట్లాది రూపాయల వ్యవయంతో రోడ్లు, డ్రైనేజి వ్యవస్థ, పాఠశాలకు వసతులు, క్రీడా మైదానం, తదితర వాటిని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ పంచాయతీపై ప్రేమ కురిపించిన పవన్‌కల్యాణ్‌కు చెడ్డ పేరు తీసుకువచ్చేలా కబ్జా పనులు సాగుతున్నాయి. సర్వే నెంబరు 2085లో 17.54 ఎకరాల వంక పొరంబోకు స్థలం ఉంది. వైసీపీ ప్రభుత్వంలో ఈ భూమిపై పలువురు కన్నేశారు. వైసీపీ ప్రభుత్వంతో మైసూరివారిపల్లె ప్రజలు, జనసేన నేతలు పెద్దగా పోరాడారు. అయినా సుమారు ఐదెకరాలు కబ్జాకు గురైంది. కూటమి ప్రభుత్వం రాగానే కొందరు నేతల అండతో ఇదే సర్వే నెంబరులో మిగిలిన వంక పొరంబోకు స్థలాన్ని కబ్జా చేశారు. ఈ విషయంపై ఉన్నత స్థాయి కూటమి నేతలకు సమాచారం వెళ్లింది. అధికారులు కూడా ఏమీ చేయలేక తలలుపట్టుకుంటున్నారు. అధికారులు వంక, ఏటి పొరంబోకు స్థలాలకు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పట్టాలు ఇచ్చే సాహసం చేయలేకున్నారు. గతంలో అధికారులు వైసీపీ పెద్దలు చెప్పినట్లు అధికారులు తలలు ఆడించారు. దీంతో కూటమి ప్రభుత్వంలోనూ అధికారులపై కేసులు నమోదు అవుతుండడం కూటమి నేతలకు తెలియదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు మంచి ప్రభుత్వాన్ని ఇస్తామని, ఎక్కడా కబ్జాలకు తావు లేకుండా చేస్తామని నేతలు హామీలు ఇచ్చి నేడు వారే చేస్తే ఎలా అనే ప్రశ్నలు ఎదురవడం కొసమెరుపు.



ఇటీవల గంగరాజపురం వద్ద ఆక్రమణలపై చోటుచేసుకున్న వివాద దృశ్యం - గంగరాజపురం వద్ద వంకపొరంబోకు స్థలానికి బోర్డు నాటిన రెవెన్యూ అధికారులు

చర్యలు తీసుకుంటాం

కబ్జా దారులపై చర్యలు తీసుకుంటాము. కబ్జాకు గురైన ప్రాంతంలో కట్టడాలు, పండ్ల మొక్కలు ఉంటే మాత్రం తొలగిస్తాము. వంక, ఏటి పొరంబోకు స్థలాలను కబ్జాలు చేస్తే మాత్రం చట్టరీత్యా చర్యలు తీసుకుంటాము.

మహబూబ్ చాంద్,
తహసీల్దారు రైల్వేకోడూరు

విధివంచిత ఆ నవ వధువు
కాళ్ల పారాణి ఆరకముందే మృత్యు కౌగిట్లోకి స్వాతి ● తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు



నవవధువుగా... విగత జీవిగా స్వాతి

పెద్దముడియం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆనందంగా జీవితాన్ని అనుభవించాలని, కొత్త వైవాహిక జీవితంలో ఉండే అనుభూతులు, అనుభవాలు ఆస్వాదిస్తూ భర్తతో కలిసి నూరేళ్ల జీవితాన్ని గడపాలని ఆమె ఊహించుకుంది. బిడ్డల పెరుగుదల, వారికి కల్పించే సదుపాయాలపై ఒకింత అవగాహనకు వచ్చింది. ఇలా భర్తతో వివాహ జీవితంపై ఎన్నో ఆశలు పెంచుకుంది. కాళ్ల పారాణి ఆరకముందే కాలం కాటేయడంతో విధి చేతిలో నవవధువు స్వాతి(20) ఓడింది. పెళ్లి జరిగిన ఇంట కట్టిన మామిడి తోరణాలు వాడకముందే పెళ్లి భాజా మోగి 24గంటలు తిరగకముందే చావు మేళా మోగింది. ఈ హృదయ విదారక ఘటన పెద్దముడియంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సుబ్బారావు అందించిన వివరాల్లోకెళితే...

పెద్దముడియం గ్రామానికి చెందిన హేమంత్‌కు పెండ్లిమర్రి మండలానికి చెందిన స్వాతితో 17న పెద్దముడియంలో వరుడి స్వగృహంలో బంధువుల సమక్షంలో వివాహం జరిగింది. వేడుక జరిగిన వెంటనే బంధువులంతా ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. 18వతేదీ సోమవారం మళ్లిపెళ్లి జరగాల్సి ఉంది. కాగా 18న సోమవారం ఉదయం నిద్రలేచిన స్వాతి స్పృహ తప్పి ఒక్కసారిగా కుప్పకూలింది. గమనించిన వరుడు హేమంత్ కుటుంబీకులు స్వాతిని హుటాహుటిన చికిత్స కోసం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆ వధువు తనువు చాలించింది. వరుడు, వారి బంధువుల సమాచారంతో మృతురాలి తల్లిదండ్రులు సంఘటనాస్థలం పెద్దముడియం చేరుకున్నారు. నవవధువు స్వాతిని విగతజీవిగా చూడడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. చూసిన వారు అయ్యో పెళ్లింట్లో ఇంత విషాదమా అంటూ విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు మృతురాలి తండ్రి ఓబన్న పెద్దముడియం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మొత్తమ్మీద పెళ్లింట ఇలా 24గంటలు గడవకముందే ఇలాంటి దారుణం చోటు చేసుకోవడంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రీమియం చెల్లింపు నమోదు ప్రారంభం
కామన్ సర్వీస్ సెంటర్‌లో నమోదు ● బ్యాంకు ద్వారానే చెల్లింపు ● డిసెంబరు 15 వరకు గడువు

కడప రూరల్, నవంబర్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీపంటలకు సంబంధించి 2024-25కు పంటల బీమా, ఫసల్ బీమా(పిఎంఎఫ్‌బీవై) పథకాల్లో పంటల వారీగా ప్రీమియం చెల్లింపు నమోదు ప్రారంభమైంది. పంట రుణాలు పొందని రైతులు నేరుగా చెల్లించేందుకు సమీప(సీఎస్‌సీ) కామన్ సర్వీస్ సెంటర్‌లో నమోదు చేసుకోవాలి. పంట రుణ గ్రహీతలు, రైతులు నేరుగా బ్యాంకు ద్వారానే చెల్లించాల్సి ఉంది. రబీలో బ్యాంకు ద్వారా పంట రుణాలను పొందని రైతులు సీఎస్‌సీ ద్వారా ప్రీమియం చెల్లించాలి. నేరుగా ప్రీమియం చెల్లించే రైతులు ఆధార్, బ్యాంకు పాస్‌బుక్, పట్టాదారు పాసుబుక్, పంట ధ్రువీకరణ పత్రం, ఆధార్ అనుసంధానమైన మొబైల్ నెంబర్ వివరాలను జతపరుస్తూ నమోదు చేసుకోవాలి. రైతులు స్వయంగా ఎన్‌సీఐపీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవడానికి వీలుకల్పించారు. ప్రీమియం చెల్లించడానికి 2024 డిసెంబరు 15వ తేదీ వరకు గడువు కల్పించా రు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన రైతు సోదరులంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. నోటిఫైడ్ క్రాఫ్ రబీ 2024-25కు రైతు వాటా ప్రీమియం ధరలు

సీ.నెం	పంట	బీమాయూనిట్	నష్టపరిహారం	బీమామొత్తం	స్థూలప్రీమియం	సెంట్రల్	రాష్ట్రం	రైతు	హెక్టారుకు	ఎకరాకు
1	వరి	ఎంఐయు	80శాతం	రూ.1050000	3.00 శాతం	0.75	0.75	1.50	రూ. 1575	రూ. 638
2	శనగ	ఎంఐయు	70 శాతం	రూ.80000	17.97 శాతం	8.24	8.24	1.50	రూ. 1200	రూ. 486
3	వేరుశగ	ఎంఐయు	80శాతం	రూ.80000	3.00 శాతం	0.75	0.75	1.50	రూ.1200	రూ. 486
4	జొన్న	ఎంఐయు	80 శాతం	రూ.52500	3.00 శాతం	0.75	0.75	1.50	రూ.787.5	రూ. 319
5	పచ్చిమిర్చి	డీఐయు	80శాతం	రూ.45000	2.00శాతం	0.25	0.25	1.50	రూ.675	రూ. 273
6	బ్లాక్‌గ్రామ్	ఎంఐయు	80శాతం	రూ.47500	6.00 శాతం	2.25	2.25	1.50	రూ.712.5	రూ. 288
7	సీసమ్	ఎంఐయు	80శాతం	రూ.30000	3.00 శాతం	0.75	0.75	1.50	రూ.450	రూ. 182
8	సన్‌ఫ్లవర్	ఎంఐయు	80శాతం	రూ.50000	5.00 శాతం	1.75	1.75	1.50	రూ.750	రూ. 304

సంస్థలను తరలించే పద్ధతికి స్వస్తి పలకాలి
లేదంటే ఉద్యమానికి సన్నద్ధం ● రౌండ్ టేబుల్ సమావేశంలో ఆర్‌సీపీ, సీపీఐ నేతలు


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

కడప మారుతీనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ఏర్పాటైన వివిధ సంస్థలను అమరావతికి తరలించే పద్ధతికి ప్రభుత్వం స్వస్తి పలకాలని రాయలసీమ కమ్యూనిస్టుపార్టీ (ఆర్‌సీపీ) రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రవిశంకర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో రాయలసీమలోని సంస్థలను అమరావతికి తరలించడాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మిగతా ఏ ప్రాంతానికీ జరగనంత అన్యాయం సీమకు మాత్రమే జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చెన్నూరు చక్కెర ఫ్యాక్టరీ, కడప పేపర్ మిల్లు, కాటన్ మిల్లు, లంకా కేబుల్, జ్యోతి కెమికల్, నందలూరు ఆల్విన్ ఫ్యాక్టరీ, ప్రొద్దుటూరు పాలకేంద్రం మూసివేస్తూ ఇక్కడి ప్రజల జీవనోపాధిని దెబ్బతీస్తున్న తీరు దారుణమన్నారు. బ్యాంకుల విలీనం పేరుతో కడప ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ అమరావతికి తరలించేలా చేస్తున్న సన్నాహాలు సరైందికాదన్నారు. రూ.250 కోట్ల కేంద్ర నిధులతో కడపలో ఏర్పాటు చేసిన ఎంఎస్‌ఎంఈని సైతం అమరావతికి తరలించేలా జీఓ తీసుకురావడం విడ్డూరంగా వుందన్నారు. కర్నూలులోని మానవ హక్కుల, లోకాయుక్త కార్యాలయం, సీబీఐ కోర్టును కూడా తరలించే ప్రక్రియకు శ్రీకారం చుట్టడం దారుణమన్నారు. 15 ఏళ్ల కిందట కడపలో ఏర్పాటు చేసిన స్టీల్ ప్లాంట్‌కోసం అవసరమైన నిధులు కేటాయింపు చేయకపోగా, పేరుకు మాత్రమే సూపర్ స్పెషాలిటీ అందులో ఒక డాక్టర్‌కూడా వుండరు, పరికరాలుండవని, అంతలా కడపలో వైద్య రంగం భ్రష్టుపట్టిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచీ ఒక్క నంద్యాల రైలు మార్గం తప్ప మరో రైలు మార్గం అంటే తెలియని స్థితిలో వున్నామన్నారు. 1983లో తెలుగుగంగ, హంద్రీనీవా, గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్ట్ నేటికీ అసంపూర్తిగా వుండడం సీమ ప్రజల దౌర్భాగ్యమన్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్ నీటిని మినిమం బ్యాలెన్స్ మెయిటెనెన్స్ చేయకుండా వున్న నీటిని తోడేస్తున్న తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్‌సీపీ నగర కార్యదర్శి మగ్బుల్‌బాషా, లోక్‌సత్తా, జనతాదళ్ నాయకులు కృష్ణయ్య ప్రతాప్‌రెడ్డి, దళిత, గిరిజన హక్కుల పోరాట సంఘం నేతలు వెంకటేష్, ప్రసాద్, రమేష్, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

సీమ స్థాయి క్రీడల్లో సత్తా చాటిన గురుకుల విద్యార్థులు

లింగాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ స్థాయి జోన్-4 క్రీడల్లో ఇప్పట్ల గురుకుల కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. 14 నుంచి 18 వరకు జరిగిన పోటీల్లో సీనియర్ ఇంటర్ విద్యార్థులు డిస్క్ త్రోలో మొదటిస్థానం నిర్మలజ్యోతి, జావెలిన్ త్రోలో తృతీయస్థానం, కె. అనూష, చెస్‌లో ద్వితీయ స్థానం ఎం.శ్రావణి, లాంగ్‌జంప్‌లో నాలుగోస్థానంలో ఎస్.శ్రీవాణి, త్రోబాల్‌లో కె.అనూష టీం రన్నర్స్‌గా నిలిచారు. జూనియర్ ఇంటర్ విభాగంలో వంద మీటర్లు రన్నింగ్‌లో వి.భవ్య ద్వితీయస్థాన, రెండు వందల మీటర్ల రన్నింగ్‌లో వి. భవ్య మొదటి స్థానం, క్యారమ్స్‌లో టి.సింధు, కె.అలేఖ్యలు విన్నర్స్‌గా నిలిచారు. 1500 మీటర్ల ర్నింగ్‌లో టి.షర్మిల తృతీయస్థానంలో నలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులందరిని కళాశాల ప్రిన్సిపాల్ సత్యవతమ్మ తదితరులు అభినందించారు.

రేపు బండలాగుడు పోటీలు

సికెదిన్నె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఊటుకూరు కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. ఓల్డ్ కేటగిరీ ఎద్దుల బండలాగుడు పోటీల్లో మొదటి బహుమతి రూ.40వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, 4వ బహుమతి రూ.10 వేలు, 5వ బహుమతి రూ.5 వేలు, 6వ బహుమతి రూ.3 వేలు అందించనున్నట్లు తెలిపారు. 20వ తేదీ యాగశాల, యజ్ఞయాగాదులు, 21న హోమాలు, ప్రత్యేక పూజలు, 22 విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

చెన్నూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొక్కిరాయపల్లె వెళ్లే దారిలోని బయోమాస్‌ప్లాంటు వద్ద మంగళవారం ఆటో ఢీకొనడంతో రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. రామాంజనేయులు వ్యక్తిగత పని నిమిత్తం కొక్కిరాయపల్లె నుంచి బైక్‌లో చెన్నూరుకు వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ సంఘటనలో రామాంజనేయులు కాళ్లు, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు స్వాధీనం

నందలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): టంగుటూరు సమీపంలోని చెయ్యేరులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఎక్స్‌కవేటర్లు, 5 ట్రాక్టర్లను మంగళవారం పెనగలూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసి ఉన్నతాధికారుల సూచన మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు. స్వాధీనం చేసుకున్న వాటిని నందలూరు పోలీసుస్టేషన్‌లో అప్పగించారు.

సిద్దవరంలో 150 మామిడి మొక్కల నరికివేత

పెనగలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో రెండేళ్ల వయసున్న 150 మామి డి మొక్కలను సోమవారం ఉదయం నరికివేసిన ట్లు ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. తిరుమల రాజంపేట హరిజనవాడ వాసి రామాంజనమ్మ ఐదెకరాల్లో రెండేళ్ల కిందట మామిడి మొక్కలు నాటి సంరక్షించుకుంటోంది. అదే గ్రామానికి చెం దిన పూలతోట హరి వాటిని నరికివేశాడం టూ లేబాక శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జాబ్ మేళాలో 12 మందికి ఉద్యోగాలు

తంబళ్లపల్లె, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీయువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ టీఓ నాగరాజు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో టెన్త్ నుంచి డిగ్రీ విద్యార్థులకు జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. వీరికి ముత్తూట్ ఫైనాన్స్, అపోలో కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు 12 మందిని ఎంపిక చేసుకున్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి వెంకటేష్ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఆశయంతో ప్రతి నెలా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


ఎక్స్‌రే తీయించుకోవడానికి వచ్చిన వృద్ధునికి, బయట తీసుకోవాలని చెబుతున్న వైద్యసిబ్బంది

సమస్యల వలయంలో ప్రభుత్వ పీహెచ్‌సీలు

● వేధిస్తున్న సిబ్బంది కొరత.. పరికరాలలేమి
● శిథిలావస్థలో కలకడ, వాల్మీకిపురం ఉపకేంద్రాలు

మదనపల్లె, అర్బన్, టౌన్, బి.కొత్తకోట, ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దతిప్పసముద్రం, నిమ్మనపల్లె, రామసముద్రం, పెద్దమండ్యం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులు సమస్యలతో సతమతమవుతున్నాయి. ఆసుపత్రులలో తగినట్లు వైద్యులు, సిబ్బంది లేరు. ముఖ్యంగా వ్యాధిని నిర్ధారించే వైద్య పరికరాలైన స్కానింగ్, ఎక్స్‌రే యంత్రాలు అందుబాటులో లేవు. కొన్ని చోట్లా అవి ఉన్నా రిపేర్లతో పక్కన పడేశారు. ఆసుపత్రుల లో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఇబ్బందులపైన మంగళవారం ఆంధ్రజ్యోతి ఆన్‌లైన్ విజిట్‌లో పలు విషయాలు వెల్లడయ్యాయి.

●మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో నెలరోజులుగా ఎక్స్‌రే యంత్రం పనిచేయడం లేదు. అందుకు కావాల్సిన పరికరానికి ప్రభుత్వానికి ఆర్డర్ పెట్టగా, ఇంకా రాలేదని వైద్యులు చెబుతున్నారు. ఎక్స్‌రే అవసరమయ్యే రోగుల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఈ క్రమంలో వారంతా బయట ప్రవేటు సెంటర్లకు వెళ్లి తీసుకుంటున్నారు. అలాగే ఆపరేషన్ థియేటర్‌లో ఏసీ లేకపోవడంతో అటు వైద్యులు, ఇటు రోగులు ఇబ్బంది పడుతున్నారు.

●మదనపల్లె మండలం సీటీఎం, బొమ్మన చెరువులలో పీహెచ్‌సీ కేంద్రాలకు వచ్చే రోగులకు సరిపడా వైద్యులు, సిబ్బంది లేరు. పీహెచ్‌సీ ఊరికి దూరంగా ఉండటంతో సిబ్బంది రాత్రివేళల్లో విధులకు వెళ్లడానికి భయపడు తున్నారు. ఇక్కడ వైద్య సిబ్బందే కాదు..అటెండర్, వాచ్‌మెన్ కూడా లేరు. స్టాఫ్ నర్సుపోస్టు ఖాళీగా ఉంది. ఆసుపత్రి అభివృద్ధి నిధులు గతంలో రూ.1.75లక్షలు వస్తుండగా, ప్రస్తుతం రూ.85వేలే వస్తున్నాయి.

● బి.కొత్తకోట పీహెచ్‌సీ 30 పడకల నుంచి కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌గా అప్‌గ్రేడ్ అయింది. దానికి తగినట్లు సిబ్బంది, ఇతర పరికరాలు లేవు. మహిళలకు స్కానింగ్, ఎక్స్‌రే పరికరాలు లేవు. రోజుకు సుమారు 300 నుంచి 400 మంది ఓపీ రోగులు వస్తున్నారు. రాష్ట్రంలోనే ఇక్కడి పీహెచ్‌సీ రెండోస్థానంలో ఉండగా, ఆ స్థాయిలో రోగులకు వైద్యసేవలు అందడం లేదు.

●పెద్దమండ్యం పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. పీటీఎం పీహెచ్‌సీలో సిబ్బంది కొరత రోగులను వేధిస్తోంది. ఇక్కడహెల్త్ ఎడ్యుకేటర్(హెచ్‌ఈ)గా పనిచేస్తున్న సరస్వతి బదిలీ కావడంతో ఆ పోస్టు ఖాళీగా వుంది.

● రామసముద్రంలో కుక్కకాటు, పాముకాటుతో సహా 163 రకాల మందులు అందుబాటులో ఉన్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. వైద్యులు, సిబ్బంది నివాస భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి.

● నిమ్మనపల్లె పీహెచ్‌సీలో ఇద్దరి బదులు ఒకరే వైద్యుడు ఉన్నారు. మరొకరు డిప్యూటేషన్‌పై మదనపల్లెకు బదిలీపై వెళ్లారు.

●ములకలచెరువు పీహెచ్‌సీలో ఉదయం 11గంటలైనా వైద్యులు రాలేదు. ఇక్కడ ఇద్దరు వైద్యులు ఉండాల్సిఉండగా, ఒకరు మెటర్నరీ సెలవులో వెళ్లగా, ఇంకొకరు 104 సేవలకు వెళ్లినట్లు చెప్పారు. దీంతో రోగులకు బయట సిబ్బంది చికిత్స చేసి పంపారు.

●తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె పీహెచ్‌సీలో కొన్ని ఏళ్లుగా స్టాఫ్‌నర్సు పోస్టు ఖాళీగా ఉంది. కమ్యూనిటీ హెల్త్ హెల్త్ ఆఫీసర్ గతేడాది రిటైర్డ్ కాగా, ఆ పోస్టు ఇప్పటికీ ఖాళీగా ఉంది.

పీలేరు ఆసుపత్రిలో నీటి కొరత!

పీలేరు/వాల్మీకిపురం/కలకడ/కలికిరి/గుర్రంకొండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలోని 100 పడకల ఆసుపత్రిలో నీటి కొరత వేధిస్తోంది. నూతన భవనంలో నడుస్తున్న ఈ ఆసుపత్రిలో సరిపడా వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నా ఆసుపత్రి ఆవరణలో నిర్మించిన ఆక్సిజన్ ప్లాంటుకు సప్లై పైపులను అమర్చాల్సి ఉంది. ఆసుపత్రికి ప్రభుత్వం అందజేసే మందులను సురక్షితంగా పెట్టుకోవడానికి ప్రత్యేకంగా గది నిర్మించాల్సి ఉంది. అదే విధంగా బయో మెడికల్ వేస్ట్ ప్లాంటును కూడా ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఆసుపత్రిలో 21 మంది వైద్యులు, 29 మంది సిబ్బంది పని చేస్తున్నారు. ఒక రేడియాలజిస్టు, ఒక జనరల్ మెడిసిన్ వైద్యుడి పోస్టు ఖాళీగా ఉన్నాయి. సగటున ప్రతిరోజూ పీలేరు ఆసుపత్రికి 700 మంది పేషెంట్లు వస్తుంటారు. ఆసుపత్రిలో నెలకు 70 వివిధ ఆపరేషన్లు చేస్తున్నారు. ఆసుపత్రికి ప్రహరీ నిర్మించాలని వైద్యులు కోరుతున్నారు. అయితే పీలేరు పట్టణానికి ఆనుకుని రెండు జాతీయ రహదారులు ఉండగా, పీలేరు ఆసుపత్రిలో ఒక ఆక్సిడెంట్ ట్రామా కేర్ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన పదేళ్లుగా ఆచరణకు నోచుకోవడం లేదు.



ఉదయం 11గంటలలైనా ములకలచెరువు పీహెచ్‌సీలో ఖాళీగా దర్శనమిస్తున్న డాక్టర్ కుర్చీ

● కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లు అందుబాటులో ఉన్నారు. ఏఎన్ఎం పోస్టు రెండేళ్లుగా ఖాళీగా ఉంది. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఏఎన్ఎం డిప్యూటేషన్‌పై వెళ్లడంతో అత్యవసర సమయాల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇక కలకడ పీహెచ్‌సీ ఉపకేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకుంది. దానికి తోడు ఊర్లోని చెత్తాచెదరాన్ని అందులో వేస్తుండడం తో అది పాములకు నిలయమంగా మారింది.

● వాల్మీకిపురం మండలంలో ని వాల్మీకిపురం , చింతపర్తి లోని పీహెచ్‌సీలో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు బాగా నే అందుతున్నాయి. చింతపర్తి పీహెచ్‌సీ ఆవరణలోని క్వార్ట ర్స్ శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా ఉన్నాయి.

● గుర్రంకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత ఉంది. ఈ ఆసుపత్రి 24 గంటల ఆసుపత్రి కావడంతో రాత్రి పూట కాన్పుల కేసులు వస్తే సిబ్బంది కొరతతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండా ల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు.వీరు రాత్రి పూట విధులకు వచ్చి వెళుతుండడంతో ఉదయం ఓపీ సమయంలో రోగులు వైద్యం కోసం ఇబ్బంది పడుతున్నారు. ఆసుపత్రి పరిసరాలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి.

●కలికిరి సీహెచ్‌సీలో నీటి కోసం ఏర్పాటు చేసిన ట్యాంకులు నిరర్థకంగా పడిఉ న్నాయి. అంతర్జాతీయ సంస్థ యునిసెఫ్ రెండు నీటి ట్యాంకులను అందుబాటులో ఉంచినా అవి వాడటానికి పనికి రాకుండా పోయాయి. రోజూ దాదాపు 200 మందికి రోగులు చికిత్స కోసం వస్తుంటారు. వారికి చిన్న ట్యాంకులు అయితే నీరు సరిపోతుంది.


కలికిరి ఆసుపత్రిలో నిరుపయోగంగా ఉన్న నీటి ట్యాంకులు

ఉన్నత పాఠశాలలను 4 గంటల వరకే నిర్వహించాలి

మదనపల్లె, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు సాయంత్రం 4 గంటల వరకే నిర్వహించాలని 5 గంటల వరకూ ప్రతిపాదనపై ప్రభుత్వం పునరాలోచించాలని మాజీ సైనికుల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు పేర్కొన్నారు. స్థానిక నిమ్మనపల్లె సర్కిల్‌లోని డివిజన్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇప్పటికే ఉన్న సమయం సాయంత్రం 4 నుంచి 5గంటలకు పెంచితే చాలా మంది విద్యార్థులు బడికి దూరమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు పాఠశాల సమయం ముగియగానే, స్థానికంగా వారంతా, తల్లిదండ్రులకు పనిలో సహాయసహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. పైగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత పాఠశాలలు కూడా కనీసం అయిదారు కిలోమీటర్లు దూరం ఉన్నాయని, పాఠశాలలు అయిదు గంటలకు వదిలితే, వారు ఇంటికి చేరుకోడానికి బస్సు, ఆటోలో ప్రయాణించడానికి మరోగంట సమయం పట్టే అవకాశం ఉందన్నారు. అలాగే అక్కడి రోడ్డు మార్గం నుంచి కొన్ని గ్రామాలకు కాలినడకన వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఇలా గ్రామీణ విద్యార్థులు ఇళ్లకు చేరుకోవడానికి సాయంత్రం 7గంటలు అవుతుందన్నారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన వివరాలతో కూడిన వినతి పత్రాన్ని సీఎం చంద్రబాబునాయుడుకు పాఠశాల విద్యాశాఖకు,, కు పంపుతున్నట్లు శ్రీనివాసులునాయుడు వివరించారు.

రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

పెద్దతిప్పసముద్రం/కురబలకోట, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ సూచించారు. మంగళవార పీటీఎం మండలంలోని తుమ్మరకుంట గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన పలు పంటలను పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ పంట మార్పిడి విధానం తప్పనిసరన్నారు. వేరుశనగ పంటలకు జిప్సం తప్పకుండా వాడుకోవాలన్నారు. రబీ పంటలకు సం బంధించి పంటబీమా రైతులు టమోటా ఎకరాకు 1600, వరికి 126, వేరుశనగకు 96 రూపాయల వంతున ప్రీమియం డిసెంబర్ నెలాఖరులోగా చెల్లించాలన్నారు. కార్యక్ర మంలో మండల వ్యవసాయాధికారిణి ప్రేమలత, రైతుసేవాకేంద్రం సిబ్బందితో పాటు తుమ్మరకుంట గ్రామ రైతులు పాల్గొన్నారు. రైతులు బీమాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. మంగళవారం కురబలకోట మండలంలోని ముదివేడు, పిచ్చలవాండ్లపల్లె గ్రామాల్లో పొలం పిలు స్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రబీ పంటలైన టమోటా, వరి, వేరుశనగా పంటలపై భీమా సౌకర్యాన్ని కల్పిస్తుం దని దీనిపై రైతులు అగాహన పెంచుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ శివశంకర్, ఏవో. రాధ, శాస్త్రవేత్తలు శ్రీనిసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అపార్‌లో విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చూడండి


ఉన్నత పాఠశాలలో విద్యార్థుల రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దతిప్పసముద్రం నవంబర్ 19 (ఆంధ్ర జ్యోతి) : ఆయా పాఠశాలల్లో అపార్ ఐడీ కోసం విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి కరుణాకర్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని బూర్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు అపార్ జనరేషన్ పనులను వేగవంతం చేయాలన్నారు. అనంతరం పాఠశాలలో గత ప్రభుత్వం లో జరిగిన నాడు - నేడు పనులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న పాఠశాల నిర్మాణ పనులను తక్షణం పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీమేశ్వరాచారి, బాలసంజీవ యాదవ్, పెన్నయ్య, లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ వస్తువుల వేలంలో రూ.96వేల ఆదాయం

మదనపల్లె టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ వస్తువుల వేలం ద్వారా తమ శాఖకు ఆదాయం వచ్చిందని ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పుంగనూరురోడ్డులోని ఏపీఎస్‌బీసీఎల్ డిపో ఆవరణలో ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను వేలం వేశామన్నారు. ఈ వేలం పాటల్లో ఆరుగురు పాల్గొనగా, 10 క్యాష్ చెస్ట్‌లు, 21 క్యాష్ కౌంటింగ్ మిషన్లు వేలం పాటలో పాడుకున్నారన్నారు. దీంతో రూ.96,536 ఎక్సైజ్‌శాఖకు ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో సీఐ ప్రశాంత్ విజయ్, స్టోర్ ఆఫీసర్ నరేంద్ర, పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన హంద్రీ-నీవా భూములపై విచారణ


విక్రయాలు జరిపిన భూమిలో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

కురబలకోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):హంద్రీ-నీవా కాలువకు సంబంధించి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. 'ఆంధ్రజ్యోతి'లో రియల్ వ్యాపా రులు బరితెగింపు శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి విచారణ చేపట్టారు. జిల్లాలో అంగళ్ళు పరిసర ప్రాంతాలు విద్యాసంస్థలకు నెలవుగా ఉండటంతో ఈప్రాంతంలో భూముల ధరలు ఆకాశాన్నంటాయి. విద్యాసంస్థల చుట్టు పక్కల ప్రాంతాల్లో భూముల ధరలు ఎకరం రూ.3నుంచి రూ.8కోట్ల అమ్ముబలుకుతున్నాయి. కాగా అంగళ్ళు పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 220లో 69 ఎకరాల భూమి విస్తీర్ణం ఉండగా గతంలో హంద్రీ-నీవా కాలువ కోసం ప్రభుత్వం రైతుల నుంచి 6.40 ఎకరాల భూమిని కొనుగోలు చేసి కేటాయించింది. అయితే ఆ భూమిలో కొంత మేరకు హంద్రీ-నీవా నిర్మాణం జరిగింది. కాలువకు పోగా మిగిలిన భూమి పై రియల్టర్‌లు కన్నేసి రకరకాలుగా పథకాలు పన్ని ఆ భూమిలో ప్లాట్లు వేసి అమ్మేశారు. రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి సర్వే చేయగా దాదాపుగా 1.60 ఎకరాలలో ప్లాట్లు వేసినట్లు సర్వేలో వెలుగుచూసింది. దీనిపై విచారణ నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేయడంతో పాటుగా, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలి

కురబలకోట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాలువకు సంబంధించి భూమిని ఆక్రమించుకుని ప్లాట్లు వేసి విక్రయాలు చేపట్టిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు కృష్ణప్ప, సాంబశివలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'ఆంధ్రజ్యోతి'లో రియల్ వ్యాపారులు బరితెగింపు శీర్షికన కథనం ప్రచురితం కావడంతో సీపీఐ నాయకులు అక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలువ భూమిని దర్జాగా రియల్టర్‌లు ఆక్రమించుకుని వ్యాపారం చేస్తుంటే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టకపోతే ఆందోళన కార్యక్రమాలు చేడుతామన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మదనపల్లె టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం తట్టివారిపల్లెలో సర్పంచ్ దీపా, మాజీ సర్పంచ్ వేమారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. మంగళవారం తట్టివారిపల్లె గ్రామ సచివాలయంలో స్వస్థ ఆస్పత్రి వైద్యులు నిర్వహించిన వైద్య శిబిరంలో 122 మంది ప్రజలు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ముఖ్యంగా ఈసీజీ, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. వీటితో పాటు మహిళలకు గైనిక్ సమస్యలపై మహిళా వైద్యురాలు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి చికిత్సలు అందించారు. వీటితో పాటు వైద్య పరీక్షలు చేయించకున్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమేష్, చిద్విలాస్, పీఆర్‌వో పవన్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఆరోగ్యసూత్రాలు పాటించాలి

మదనపల్లె టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): యుక్తవయస్సు వచ్చిన బాలికలు, ఆరోగ్యసూత్రాలు పాటించాలని ఫెమి సంస్థ నిర్వాహకులు అనంత్‌మునిరాజ, జయశ్రీ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక శ్రీనివాస డిగ్రీ కళాశాలలో హ్యాపి యూటరస్, హెల్తీ పీరియడ్స్ అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో అన్ని అనారోగ్యాలను దూరం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.శ్రీనివాసులురెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి రెడ్డిశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కర్ణాటక సరిహద్దు చెన్నరాయునిపల్లె క్రాస్‌లో సోమవారం రాత్రి ఓ వ్యక్తి మృతికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పీటీఎం ఎస్ఐ నరసింహుడు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం చెలకలనేర్పుకు చెందిన రామాంజి (38), అతని భార్య లక్ష్మీదేవి, కుమారుడు నిఖిల్ తమ స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంలో వెళుతుండగా చెన్నరాయునిపల్లె క్రాస్ వద్ద ఓ ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా రోడ్డులో నిలిపేసి ఒక వ్యక్తి ప్రాణాలకు కారణమయ్యాడని మృతుడి తల్లి వెంకట్రమణమ్మ పిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

రామసముద్రం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాప్పల్లె గ్రామ సమీపంలో మంగళవారం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న రైతును వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలైన ఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటసుబ్బయ్య వివరాల మేరకు నారేవారిపల్లె గ్రామానికి చెందిన రైతు రామచంద్ర(40)వ్యవసాయ బోరు వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొనడంతో రామచంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని వెంటనే మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారని ఎస్ఐ తెలిపారు.

108 ఉద్యోగుల సమస్యలు సత్వరం పరిష్కరించాలి

వాల్మీకిపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 108 ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని 108 సిబ్బంది డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు మంగళవారం 108 వాహనం ఎదుట నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహిస్తూ తమ కనీస డిమాండ్లు పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఈనెల 25 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో 108 సిబ్బంది అమరనాథబాబు, సుబ్రహ్మణ్యం, సంకృతి, రెడ్డిరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు కలకడ విద్యార్థులు


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం చెంగల్‌రాయులు

కలకడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కోన హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు ఎంపికైనట్లు హెచ్‌ఎం చెంగల్‌రాయులు తెలిపారు. గత నెల తెనాలిలో జరిగిన అండర్-14 రాష్ట్ర స్థాయి పోటీల్లో బాలుర విభాగంలో సాయినాథ్, బాలికల విభాగంలో మోక్షిత పాల్గొన్ని ప్రతిభ కనబరిచనట్లు తెలిపారు. వారు ఈ నెల 25 నుంచి 29 వరకు చత్తీస్‌గడ్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అలాగే పాఠశాల పీడీ ఝాన్సీరాణి పోటీలకు రాష్ట్రం తరపున కోచ్‌గా నియమితులైనట్లు తెలిపారు. పీడీని, విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

అనుమతులు లేకుండా లేవుట్‌లు వేస్తే చర్యలు

కురబలకోట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా లేవుట్‌లు వేస్తే చట్టపరంగా చర్యలు చేపడుతామని ఎంపీడీవో గంగయ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అంగళ్ళు సమీపంలో అక్రమంగా వేసిన లేఅవుట్‌లో ప్రభుత్వ బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అక్రమంగా నిర్మించుకున్న లేవుట్‌లు, భవనాలను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. జీవో నెంబర్ 67ప్రకారం మండల పరిధిలోని అన్ని పంచాయతీలలో అనుమతులు లేకుండా లే అవుట్‌లు భవన నిర్మాణాలను చేపట్టారని, వాటికి సంబంధించి వారం రోజులు లోగా గ్రామ పంచాయతీ అధికారులను సంప్రదించి అనుమతులను పొందాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఈవోపీఆర్‌డి శేషగిరి ప్రసాద్, ఉదయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ఝాన్సీలక్ష్మీభాయిని ఆదర్శంగా తీసుకోవాలి

మదనపల్లె టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) దేశస్వాతంత్ర్యం కోసం ప్రాణాలు త్యజించిన వీరనారి ఝాన్సీలక్ష్మీభాయిని విద్యార్థినులు ఆదర్శంగా తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు దుర్గాప్రసాద్, సాయిహితేష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఝాన్సీ లక్ష్మీభాయి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపద సమయంలో బాలికలు మనోధైర్యంతో ముందుకు సాగాలని, అత్యవసర నెంబర్లను గుర్తుంచుకుని ఫోన్ చేసి రక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శివపార్వతి ఏబీవీపీ నాయకులు కిశోర్, మోహన్‌రాజ్, రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న పల్లకీ ఉత్సవం

తంబళ్లపల్లె, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండపై సోమవారం రాత్రి భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి పల్లకీ ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. ప్రతి ఏడాది కార్తీక మాసం మూడో సోమవారం రాత్రి మల్లికార్జున స్వామిని పల్లకీపై మెరవణి చేస్తారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకుడు ఈశ్వరప్ప స్వామి వారి ఉత్సవ మూర్తులకు దూపదీప నైవేద్యాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పుష్పాలతో సుందరంగా అలంకరించిన పల్లకీపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి వాయిద్యాల నడుమ భక్తుల శివనామస్మరణలతో మలయ్యకొండపై వైభవంగా మెరవణి చేశారు. కార్యక్రమంలో ఈవో మునిరాజ, సిబ్బంది కొండ కిట్ట, భక్తులు పాల్గొన్నారు.

ఆక్రమణలను అడ్డుకున్న రైతులు


ఆక్రమణలను అడ్డుకొని నిరసన తెలియజేస్తున్న రైతులు

మదనపల్లె అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మదనపల్లె-తిరుపతి జాతీయ రహదారి వద్ద శ్రీనివాసులురెడ్డి అనే వ్యక్తి అక్రమంగా బండపై మట్టి, బండరాళ్ల వ్యర్థాలను తొలిచి చదును చేస్తుండగా పోతబోలు రైతులు అక్కడికి చేరకుని అడ్డుకున్నారు. అంతటితో ఆగకుండా వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పోలబోలు చెందిన రైతులు బుడ్డక్కగారి ఈశ్వరయ్య, బుడ్డక్కగారి లక్ష్మన్నలు గ్రామరెవెన్యూ సర్వేనెంబరు141-బి-2-6లో సుమారు రెండుఎకరాల అల్లనేరుడి చెట్లు పెంచుకొంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. దీనికి వెళ్లడానికి దారిలేకుండా చేసి ఇబ్బందికి గురిచేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ నిరసనలో పోతబోలు రైతులు భాస్కర, చంద్రశేఖర్, వెంకటరమణ, అక్కులప్ప, శ్రీనివాసులు, ఎత్తన్న, వెంకటరమణ, ఎన్. శ్రీనివాసులు, బాలరాజుకుమార్, రవికుమార్, వెంకటరమణ పాల్గొన్నారు.

చలో పలమనేరు విజయవంతం చేయండి

వాల్మీకిపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పలమనేరులో ఈనెల 23న జరగనున్న హలో మాల.. చలో పలమనేరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు శివయ్య పేర్కొన్నారు. మంగళవారం వాల్మీకిపురంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పట్ల మాలలు ఐక్యతతో చలో పలమనేరు కార్యక్రమం తలపెట్టినట్లు తెలిపారు. మండలంలోని మేధావులు, ఉద్యోగ సంఘాలు, విద్యార్థులు, మాల ప్రజా సంఘాలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయుడు వెంకటస్వామి, మండల అధ్యక్షుడు నాగార్జున, జిల్లా కార్యదర్శి రఘు, శివారుపల్లె సుధాకర్, శ్రీనివాసులు, యూత్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, అశోక్, కేవీ రమణ, కమలాకర్, ప్రభాకర్, దిలీప్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి


ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆటో స్టాండు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని స్థానిక కదిరి రోడ్డుకు చెందిన భగత్‌సింగ్ ఆటో యూనియన్ నాయకులు మంగళవారం జయచంద్రారెడ్డిని కలిసి విన్నవించారు. దీంతో ఆయన భగత్‌సింగ్ ఆటో స్టాండు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించి స్టాండును త్వరగా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు మహబూబ్‌బాషా, ఆటో రఫీ, ఖాదర్‌బాషా, నరసింహులు, ఖాదర్, ఖాసీం బాషా, సయ్యద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

మదనపల్లె అర్బన్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జీ మల్లెల పవన్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లానాయకులు సింగంరామకృష్ణారెడ్డి, మండల రూరల్ అధ్యక్షుడు వై.సురేంద్రరెడ్డి, బీసీ నాయకులు అనంత చలపతి, శ్రీకాంత్, కిషాన్ సెల్ టౌన్ మాజీ ప్రెసిడెంట్ పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం

పీలేరు, నవంబరు 19: ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని మంగళవారం పీలేరులో ఘనంగా నిర్వహించారు. విద్యా, వైద్య ఆరోగ్య శాఖ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సంయుక్తంగా పట్టణంలో మరుగుదొడ్ల ప్రాధాన్యతను వివరిస్తూ ర్యాలీలు నిర్వహించారు. పీలేరు గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను ఈ సందర్భంగా అధికారులు ఘనంగా సన్మానించారు.